

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


**అమరావతి నిర్మాణంలో కీలక ముందడుగు**
- రెండు పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

6

## సర్క్యులర్ ఎకానమీపై


# త్వరలో నూతన పాలసీ



- ఏడాదిలో రాష్ట్రంలో 3 'సర్క్యులర్ ఎకానమీ పార్కులు'
- అక్టోబర్ 2 నుంచి 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం
- 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస్- రీయూజ్- రీసైకిల్ సెంటర్లు
- వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబరిచే వారికి 'స్వచ్ఛత' అవార్డులు
- 'సర్క్యులర్ ఎకానమీ'పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

2





## కుప్పం బాధితురాలికి చంద్రబాబు ఫోన్ పరామర్శ

3

- రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటన....
- పిల్లల చదువుల బాధ్యత సర్కారుదేనని హామీ
- అండగా ఉంటామని ధైర్యం చెప్పిన సీఎం

సీఎం చంద్రబాబు నాయుడిని సంగీత దర్శకుడు, డ్రమ్మర్ శివమణి కలిశారు. అమరావతి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన శివమణి.. తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా సీఎం చంద్రబాబుకు ఆహ్వానపత్రిక అందించారు.



# 15శాతం వృద్ధి లక్ష్యం

- అందుకనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలి
- సంక్షేమానికి వనరుల లభ్యత పెరిగేలా రూపొందించాలి
- ఆర్థిక సుస్థిరత కోసం సేవలరంగంపై దృష్టి పెట్టండి
- ప్రభుత్వ కార్యక్రమాలు, సేవలపై భిన్నమార్గాల్లో ప్రజాభిప్రాయ సేకరణ
- తలసరి ఆదాయంలో ఏడాదిలో మెరుగైన ఫలితాలు శుభపరిణామం
- ప్రభుత్వ శాఖలకు మార్గనిర్దేశనంలో ప్రణాళిక విభాగమే కీలకం
- ప్రణాళికా శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన

2



## నేడు, రేపు ఢిల్లీలో మంత్రి లోకేష్ పర్యటన

- ఉప రాష్ట్రపతి, పలువురు కేంద్ర మంత్రులతో భేటీ
- చివరగా బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో సమావేశం

3

# జలదోపిడీ ఎక్కడుంది?



- బనకచర్లతో ఎవరికీ నష్టం లేదు
- వృథా నీటినే తీసుకుంటాం
- కేవలం రాజకీయ కోణంలోనే తెలంగాణ నేతల విమర్శలు
- కేసీఆర్‌ది ద్వంద్వ వైఖరి
- తెలంగాణ నేతల విమర్శలపై జగన్ ఎందుకు నోరెత్తడం లేదు
- ఆ రాష్ట్ర ప్రాజెక్టులను సీఎం చంద్రబాబు ఎప్పుడూ అడ్డుకోలేదు: మంత్రి నిమ్మల

4

## ప్రధాని పర్యటన ముందు అల్లర్లకు జగన్ స్కెచ్

- నాగమల్లేశ్వరరావు చావుకు జగన్‌రెడ్డే కారణం
- ఏడాది తర్వాత విగ్రహంతో శవ రాజకీయాలు
- సత్తెనపల్లి పర్యటన దేని కోసం.. ఎందుకోసం?
- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

7

# సర్క్యులర్ ఎకానమీపై త్వరలో నూతన పాలసీ

- ఏడాదిలో రాష్ట్రంలో 3 'సర్క్యులర్ ఎకానమీ పార్కులు'
- అక్టోబర్ 2 నుంచి 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం
- 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస్ - రీయూజ్ - రీసైకిల్ సెంటర్లు
- వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబరిచే వారికి 'స్వచ్ఛత' అవార్డులు
- 'సర్క్యులర్ ఎకానమీ'పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను పటిష్టపరిచేలా రెండు నెలల్లో సర్క్యులర్ ఎకానమీకి సంబంధించి తుది పాలసీ తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మొదటగా రాష్ట్రంలోని 3 ప్రాంతాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులను ఏడాదిలోగా ఏర్పాటు చేయాలని, అలాగే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలో ఆధునిక యంత్రాలను వినియోగాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలిగించాలని సీఎం ఆదేశించారు. 90 రోజుల్లోగా రీసైక్లింగ్, చెత్తను వేరు చేయడంపై కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలన్నారు. మంగళవారం సచివాలయంలో సర్క్యులర్ ఎకానమీపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. వ్యర్థాలనుంచి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై ప్రధానంగా చర్చించారు. 'సర్క్యులర్ ఎకానమీ పార్కులు' ఏర్పాటుపై 'మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' ప్రతిపాదనలను పరిశీలించారు. మొదటిదశలో భాగంగా విశాఖపట్నంలో 400 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న 'సర్క్యులర్ ఎకానమీ పార్కు'ను అంతర్జాతీయస్థాయిలో నిర్మించాలని, ఇందుకోసం వివిధ దేశాల్లోని పార్కులను పరిశీలించాలని సీఎం సూచించారు. వీటితో భారీగా పెట్టుబడులు వచ్చేలా చూడాలని చెప్పారు.

### 11 రంగాలు, 3శాఖలపై ప్రధానంగా దృష్టి

సర్క్యులర్ ఎకానమీ కింద కేంద్రం గుర్తించిన మున్సిపల్, వాహనాలు, లిథియం బ్యాటరీలు, జిప్సం, టైర్లు, రబ్బర్, ఎలక్ట్రానిక్, వ్యవసాయం, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాలవంటి 11 రంగాలపై దృష్టి పెట్టడంతో పాటు అదనంగా గనులు, చేనేత, పశుసంవర్థక శాఖలతో కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం నిర్దేశించారు. నగర పాలక సంస్థలు, పంచాయతీల్లో జీరో వేస్ట్ లక్ష్యసాధనకు కృషి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. వ్యర్థాల నిర్వహణలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన వాళ్లకు ప్రోత్సాహకంగా 'స్వచ్ఛత' అవార్డులను వచ్చే ఏడాది అక్టోబర్ 2నుంచి ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. స్థానిక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడీలు, పాఠశాలలు-కళాశాలలు, బస్టాండ్లు, ఆస్పత్రులు, ఎన్జీవోలు, వివిధ ఆర్గనైజేషన్ల వారీగా అవార్డులు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్దేశించారు.

### ప్లాస్టిక్ రహిత నగరాలు

ఈ ఏడాది అక్టోబర్ 2నాటికి రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండి... 4 నగరాలతోపాటు మరో 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా అరికట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ నగరాల్లో క్లాత్ బ్యాగులు వినియోగాన్ని పెంచాలని చెప్పారు. అలాగే 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస్- రీయూజ్- రీసైకిల్ సెంటర్ల ఏర్పాటు చేయాలని నిర్దేశించారు.

### మొత్తం 52 వేస్ట్ క్లస్టర్లు ఏర్పాటు

జిల్లాకు రెండు చొప్పున రాష్ట్రంలోని పట్టణాలు, పంచాయతీ ప్రాంతాల్లో మొత్తం 52 వేస్ట్ క్లస్టర్లు ఏర్పాటు చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రం నుంచి ఏటా బ్యాటరీలు, ఇతర ఆటోమోటివ్ వ్యర్థాలు 36,588 టన్నులు, ప్లాస్టిక్ -పెట్ బాటిల్స్ వేస్ట్ 61,996 టన్నులు, ఇంజిన్ ఆయిల్స్ ఇతర హైడ్రాలిక్ చమురు వ్యర్థాలు 23,928 లీటర్లు, టైర్లు-రబ్బర్ 59,654 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

అత్యధికంగా వ్యవసాయరంగం నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు, పశువులు-ఆక్వా-పౌల్ట్రీ ఈ మూడు రంగాలనుంచి 347 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ రోజూ 88 లక్షల గృహాలనుంచి 1,329 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని తెలిపారు. రాజస్థాన్, కర్నాటక, మహారాష్ట్రలో సర్క్యులర్ ఎకానమీ కోసం అందిస్తున్న ప్రోత్సాహకాల వివరాలను అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

### సర్క్యులర్ ఎకానమీ ప్రయోజనాలు

రాష్ట్రంలో సర్క్యులర్ ఎకానమీ సమర్థంగా అమలు చేయగలిగితే జీఎస్డీపీకి ఏడాదికి అదనంగా రూ.15,000 కోట్లు జత చేరుతుందని అంచనా. అలాగే మరో రూ.10,000 కోట్ల విలువైన మెటీరియల్‌ను ఉత్పత్తి రంగానికి సరఫరా చేసే అవకాశం ఉంటుంది. ఈ విలువ జోడింపుతో రాష్ట్రం జీఎస్టీ రూపంలో రూ.3,000 కోట్ల ప్రతీ ఏటా ఆర్జించవచ్చు. మరోవైపు ప్రత్యక్షంగా 1,00,000 మందికి ఉద్యోగావకాశాలు దక్కనున్నాయి. 10 వేల మైక్రో ఎంట్రప్రెన్యూర్లకు ఉపాధి లభిస్తుంది. దీంతోపాటు పరోక్షంగా 10 లక్షల మందికి ఉపాధి కలుగుతుంది. దీనికితోడు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. కర్బన వాయువుల విడుదల తగ్గుతుంది. భూ, జల, వాయు కాలుష్యాన్ని గణనీయంగా అరికట్టవచ్చు.

# 15శాతం వృద్ధి లక్ష్యం

- అందుకనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలి
- సంక్షేమానికి వనరుల లభ్యత పెరిగేలా రూపొందించాలి
- ఆర్థిక సుస్థిరత కోసం సేవలరంగంపై దృష్టి పెట్టండి
- ప్రభుత్వ కార్యక్రమాలు, సేవలపై భిన్నమార్గాల్లో ప్రజాభిప్రాయ సేకరణ
- తలసరి ఆదాయంలో ఏడాదిలో మెరుగైన ఫలితాలు శుభపరిణామం
- ప్రభుత్వ శాఖలకు మార్గనిర్దేశనంలో ప్రణాళిక విభాగమే కీలకం
- ప్రణాళికా శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన

అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగయ్యేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ప్రణాళిక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, జీఎస్డీపీ అంచనాలు, అభివృద్ధి సూచికలు,గ్రోత్ డ్రైవర్స్‌వంటి అంశాలపై చంద్రబాబు అధికారులతో చర్చించారు. సమీక్షలో ప్రణాళిక శాఖ దృష్టి సారించాల్సిన వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. గతానికంటే ఎక్కువగా ప్రణాళిక శాఖకు తాను ప్రాధాన్యమిస్తున్నట్టు చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి శాఖ మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళిక శాఖే బాధ్యత తీసుకోవాలన్నారు. రుణ భారం తగ్గించుకోవడం, సంక్షే మానికి వనరులు సమకూర్చుకోవడం వంటివి అత్యంత కీలకాంశాలని చంద్రబాబు వివరించారు. వనరుల సమీకరణలో రాష్ట్ర సొంతఆదాయం, కేంద్రంనుంచి వచ్చే నిధులతో పాటు కొత్తమార్గాలను అన్వేషించాలని సూచించారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికశాఖ పనిచేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునేందుకు అవసరమైనప్రామాణిక సమాచారాన్ని రూపొందించుకోవాలన్నారు. ఈ దిశగా ప్రణాళిక శాఖ పనితీరు మెరుగు పరుచు కోవాలని చంద్రబాబు సూచించారు. పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఏపీ బ్రాండ్ ప్రమోషన్ నిరంతరం జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటికే 25 కేబినెట్ సమావేశాలు, 6 ఎస్ఐబీపీ సమావేశాలు నిర్వహించి.. పెద్ద ఎత్తున పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని గుర్తుచేశారు. ఇక్కడితో ఆగకుండా..ఆ ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చూస్తున్నామన్నాని చంద్రబాబు స్పష్టం చేశారు.

### సాంకేతికతతో సమాచార విశ్లేషణ

కచ్చితమైన ప్రణాళికలతో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం లెక్కల్లో జాతీయస్థాయికి మించి ఏపీ పురోగతి సాధించిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జాతీయ స్థాయిలో తలసరి ఆదాయం 8.7 శాతంమేర పెరిగితే.. ఏపీ 11.89 శాతం మేర పురోగతి నమోదు చేసిందని అధికారులు వెల్లడించారు. రాష్ట్రం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు అవసరమైన డేటా అనలిటిక్స్ కోసం టెక్నాలజీని వినియోగించుకోవాలన్నారు.

ఆర్థికాభివృద్ధికి అనువుగా ఉన్న రంగాలపై దృష్టి



పెట్టడంతోపాటు.. సేవల రంగం అభివృద్ధి జరిగేలా ప్రణాళికలు రూపొందిస్తే ఆర్థికసుస్థిరతను త్వరితగతిన సాధించగలమని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్ర, జిల్లా, మండలాలతోపాటు గ్రామస్థాయిలో కూడా కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లు పెడితే.. క్షేత్రస్థాయి నుంచి పోటీతత్వం పెరుగుతుందన్నారు. 2028-29 నాటికి 15 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### అభివృద్ధి సూచికలే కీలకం

నెలవారీ అభివృద్ధి సూచికల ద్వారా ఎప్పటికప్పుడు పనితీరును సమీక్షించుకునే అవకాశం ఉంటుందని సీఎం చంద్రబాబు సూచించారు. దీనివల్ల ఎప్పుడైనా లోటుపాట్లు ఉంటే తక్షణం సవరించుకునే అవకాశం ఉంటుందన్నారు. సాంకేతికతను జోడించి నీటి యాజమాన్యాన్ని సమర్థంగా నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. సరైన నీటి యాజమాన్యం చేపడితే కరవు పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు ఉండాలన్నారు. రిజర్వాయర్లు, నేలలో తేమశాతం, భూగర్భ జలాల వివరాలు వంటివి నమోదు చేసి వివరాలు తీసుకునే బాధ్యతను ప్రణాళిక శాఖ తీసుకోవాలన్నారు. వ్యవసాయం, ఉద్యాన పంటల్లో గ్రాస్ వాల్యూ ఎడిషన్‌తో పాటు సేవల రంగంలో పెట్టుబడులు పెరిగేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. విద్యుత్ కొనుగోలు ధరలు తగ్గించేందుకు ఎలాంటి ప్రత్యామ్నాయాలు ఉన్నాయనే అంశాన్ని పరిశీలించాలని సీఎం చంద్రబాబు సూచించారు. పీ-4లో బంగారు కుటుంబాలు- మార్గదర్శుల మధ్య సమన్వయం చేసుకునే ప్రక్రియను ఆగస్టు 15లోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### మెరుగ్గా ప్రజాభిప్రాయ సేకరణ

ప్రభుత్వ సేవలు, విభాగాల పనితీరు మీద నిరంతరం ప్రజాభిప్రాయం తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ప్రభుత్వానికి చేరేలా పీపుల్ పాజిటివ్ పర్సెప్షన్ వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్, క్యూఆర్ కోడ్ విధానాల ద్వారా ప్రస్తుతం చేపడుతున్న అభిప్రాయ సేకరణతోపాటు.. మరిన్ని భిన్నమైన మార్గాల ద్వారా కచ్చితమైన సమాచారం రాబట్టేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కుప్పం బాధితురాలికి చంద్రబాబు ఫోన్ పరామర్శ

- రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటన...
- పిల్లల చదువుల బాధ్యత సర్కారుదేనని హామీ
- అండగా ఉంటామని ధైర్యం చెప్పిన సీఎం



అమరావతి (చైతన్య రథం): చిత్తూరు జిల్లా కుప్పం మండలం నారాయణపురంలో అప్పు తీర్చలేదని చెట్టుకు కట్టేసి అమానుషంగా వ్యవహరించిన ఘటనలో బాధితురాలు శిరీషతో సీఎం చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. బాధితురాలిని పరామర్శించి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఎప్పుడైనా వారినుంచి వేధింపులు ఎదురయ్యాయా? అని సీఎం అడగ్గా పలు సందర్భాల్లో తమను ఇబ్బంది పెట్టారని శిరీష వాపోయారు. ఈ ఘటనతో పిల్లలు, తాను భయపడుతున్నామని ముఖ్యమంత్రికి బాధితురాలు గోడు వెళ్లబోసుకుంది. ఇలాంటి ఘటనలను సహించే ప్రసక్తే లేదని సీఎం స్పష్టం చేశారు. మానవత్వం లేకుండా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. శిరీష పిల్లలు ఏం చదువుతున్నారో అడిగి తెలుసుకున్న సీఎం.. వారిని బాగా చదివించాలని సూచించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటానని.. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో బిడ్డలను చదివించుకోవడానికి ఇబ్బంది పడుతున్న శిరీష పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి.. అప్పటికప్పుడు ఆమెకు రూ.5 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించారు. ముగ్గురు పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం హామీ ఇచ్చారు. ఘటన, అనంతర పరిణామాలపై నివేదిక ఇవ్వాలని, బాధిత కుటుంబానికి అందుబాటులో ఉండి అవసరమైన సాయం అందేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# నేడు, రేపు ఢిల్లీలో మంత్రి లోకేష్ పర్యటన

- ఉప రాష్ట్రపతి, పలువురు కేంద్ర మంత్రులతో భేటీ
- చివరగా బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో సమావేశం

అమరావతి (చైతన్యరథం): విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించి పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. 18వ తేదీ బుధవారం ఉదయం 10.30 గం.లకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో మంత్రి లోకేష్ సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 2 గం.లకు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో మంత్రి లోకేష్ భేటీ అవుతారు. సాయంత్రం 4.30 గం.లకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో, సాయంత్రం 5.30 గం.లకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ తో సమావేశమవుతారు. 19వ తేదీ గురువారం ఉదయం కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాతో భేటీ కానున్నారు. అనంతరం యూకే మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో సమావేశం అవుతారు.



# యోగాంధ్రకు మహా సన్నాహాలు

- ప్రధాని పాల్గొనే కార్యక్రమం.. విజయవంతం చేయండి
- శాఖల మధ్య సమన్వయం అవసరం
- సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్




శ్రీకాకుళం (చైతన్యరథం): ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే విశాఖపట్నంలోని యోగాంధ్ర 2025 కార్యక్రమం రాష్ట్రానికి గొప్ప గౌరవం. ఎలాంటి లోపం లేకుండా దీనిని విజయవంతం చేయాలి.. ప్రతి శాఖ సమన్వయంతో, సమగ్ర పర్యవేక్షణతో ముందుకు సాగాలని శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, యోగాంధ్ర ఇన్‌చార్జిలు సమావేశంలో పాల్గొన్నారు.

## ప్రపంచ రికార్డు లక్ష్యం

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఇది సాధారణ కార్యక్రమం కాదు.. గిన్నిస్‌బుక్‌లో స్థానం దక్కించుకునే మహా కార్యక్రమం అన్నారు. ప్రధాని మోదీ 'యోగా'ను అంతర్జాతీయంగా గుర్తింపు పొందేలా చేసిన నేపథ్యంలో, ఆయన నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో యోగా ఉత్సవం జరగడం గర్వకారణం. సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా కేంద్రాన్ని అభ్యర్థించి ఈ అవకాశాన్ని తెచ్చారు. దీనిని దిగ్విజయం చేయడమే లక్ష్యంగా పని చేయాలని మంత్రులు పిలుపు ఇచ్చారు.

## శ్రీకాకుళం జిల్లా నుంచి 20 వేల మంది

శ్రీకాకుళం జిల్లా నుంచే 20 వేల మంది విశాఖ కార్యక్రమానికి వెళతారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివరించారు. 150 ఆర్టీసీ, 400 ప్రైవేట్ బస్సులు ఇందుకోసం ఏర్పాటు చేశామన్నారు. వీరిలో 15 వేల మంది సామాన్య ప్రజలు కాగా, మిగతా 5 వేల మంది ఇంటర్ ఆపై చదువుతున్న విద్యార్థులు ఉంటారన్నారు. భీమిలి స్పాట్ జిల్లాకు కేటాయించగా, అక్కడే వేదిక వద్ద అల్పాహారం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో ప్యాకేజ్డ్ భోజనం అందజేయాలని మంత్రులు ఈ సందర్భంగా సూచించారు.

## మరుగు దొడ్లు - ట్రాఫిక్ కీలకం

ట్రాఫిక్ నియంత్రణ, మరుగుదొడ్ల ఏర్పాటు విషయంలో ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. 9 పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశామని, పైడి భీమవరం దాటి జిల్లాలోని ప్రజలకు దాబాలు, పెట్రోల్ బంకులు, నేషనల్ హైవే టాయిలెట్ల వద్ద శుభ్రమైన వసతులు కల్పించనున్నట్టు వివరించారు.

## జిల్లాలోనే 10 లక్షల మంది భాగస్వామ్యం

జిల్లాలో వివిధ శాఖల భాగస్వామ్యంతో, ఆయుష్ శాఖ పర్యవేక్షణలో యోగాపై ఇప్పటికే ప్రత్యేక శిక్షణలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర 2025 కోసం జిల్లాలో 6,500 వేదికలు గుర్తించగా, అందులో 3,500 పాఠశాలలు ఉన్నాయన్నారు. జిల్లాలో కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే 9.5లక్షల మంది రిజిస్ట్రేషన్ పూర్తయ్యింది.

రెండు లక్షల మందికి పైగా విద్యార్థులు ఈనెల 21న కార్యక్రమంలో పాల్గొంటారని.. మొత్తం 10 లక్షల మందిని కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలన్నదే లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశం లో ఎమ్మెల్యేలు కూన రవికుమార్, బగ్గు రమణ మూర్తి, గొండు శంకర్,నడుకుదిటి ఈశ్వరరావు, పామర్రు ఎమ్మెల్యే కుమార్ రాజా, ఎర్రగొండ పాలెం ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, పలుశాఖలు ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాదానమే ఉన్నతోన్నతం

**అన్నదానము గొప్పదనవచ్చనేకాని**
**అన్నంబు జాములో అరిగిపోవు**
**వస్త్రదానం కూడ భవ్యదానమేకాని**
**వస్త్రమేడాదిలో పాతదగును**
**గృహదానమొకటి ఉత్కృష్టదానమేకాని**
**కొంప కొన్నేళ్లలో కూలిపోవు**
**భూమిదానము మహా పుణ్యదానమేకాని**
**భూమి అన్యుల చేజారిపోవచ్చు**
**అరిగిపోక... ఇంచుకయేని చిరగిపోక**
**కూలిపోక.. అన్యులపాలుకాక**
**నిత్యమై, వినిర్మలమై, నిశ్చలమై**
**యొప్పుచుండు విద్యాదానమొకటి జగతి.**

**– చిలకమర్తి లక్ష్మీనరసింహం**

గొప్పకవి అయిన చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు ఆకాంక్షను తెలుగు నేలపై సాకారం చేస్తున్నది చంద్రన్నే. ఆ స్ఫూర్తిని ఉన్నతోన్నతం చేస్తున్నది నారా లోకేష్.

–నాడు చంద్రన్న కిలో మీటరుకు ఒక ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్లకు ఒక మాధ్యమిక పాఠశాల, ఐదు కిలోమీటర్లకు ఒక ఉన్నత పాఠశాల, ప్రతి మండలంలో ఒక ఇంటర్ కాలేజ్, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ఒక ఇంజనీరింగ్ కాలేజీ, ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీ స్థాపించి విద్యా విప్లవాన్ని సామాన్యులకు చేర్చారు. ఉన్నతమైన ప్రొఫెషనల్ కాలేజీలు ఎన్నో స్థాపించారు. అంబేద్కర్ విదేశీ విద్య ప్రవేశపెట్టారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రెసిడెన్షియల్ విద్యా సంస్థల్ని విస్తృతపర్చారు. నేడు ప్రతి నలుగురు ఎన్‌ఆర్‌ఐలలో ఒకరు తెలుగు వారు ఉన్నారంటే కారణం చంద్రన్నే.


నేడు విద్యాశాఖమాత్యులు విద్యా సంస్కరణలతో మహా విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టారు. ఎందరు పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం మరో గేమ్‌ఛేంజర్ కాబోతోంది. తెలుగు నేల నాలెడ్జ్ సొసైటీగా విలసిల్లాలన్న చంద్రన్న కలల్ని యువనేత లోకేష్ పరిపూర్ణం చేస్తున్నారు.



**- గురజాల మాల్యాద్రి,**
**ఛైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్**

# బనకచర్లతో ఎవరికీ నష్టం లేదు

- మంత్రి నిమ్మల స్పష్టీకరణ
- కేవలం రాజకీయ కోణంలోనే తెలంగాణ నేతల విమర్శలు
- కేసీఆర్‌ది ద్వంద్వ వైఖరి
- అప్పట్లో గోదావరి వరద జలాలు సీమకు తరలించేందుకు అంగీకారం
- అసెంబ్లీలోనే ప్రకటించిన నాటి సీఎం జగన్
- ఇప్పుడు వరద జలాలు తీసుకుంటామంటే అడ్డగోలు మాటలు
- తెలంగాణ నేతల విమర్శలపై జగన్ ఎందుకు నోరెత్తడం లేదు
- ఆ రాష్ట్ర ప్రాజెక్టులను సీఎం చంద్రబాబు ఎప్పుడూ అడ్డుకోలేదు




అమరావతి (చైతన్యరథం): బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అసలు వాస్తవాలు ప్రజలకు తెలియాలన్నారు. అమరావతిలోని సచివాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలవరం–బనకచర్ల ప్రాజెక్ట్ గురించి మంత్రి నిమ్మల వివరించారు. 50 ఏళ్లుగా గోదావరి నీరు సగటున ఏటా వృథాగా 3000 టీఎంసీల వరకు సముద్రంలో కలుస్తోందని, ఇందులో 200 టీఎంసీల నీటిని బనకచర్లకు తరలించటమే ఈ ప్రాజెక్ట్ నిర్మాణ ఉద్దేశమని తెలిపారు. మూడు సెగ్మెంట్‌లుగా బనకచర్ల నిర్మాణం జరుగుతుందన్నారు. పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు.. ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్ వరకు.. బొల్లాపల్లి నుంచి బనకచర్ల వరకు... ఇలా మూడు సెగ్మెంట్‌ల్లో ఈ ప్రాజెక్ట్ నిర్మిస్తామని మంత్రి నిమ్మల వెల్లడించారు.

## రాజకీయం కోసమే ఆరోపణలు

బనకచర్లపై తెలంగాణ నేతలు చేస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయాల కోసమేనని, సాంకేతిక అంశాల కన్నా రాజకీయ దృష్టితోనే ఆరోపణలు చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. తెలంగాణలో అంతర్గత రాజకీయాల కోసం బనకచర్లపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకు వెళుతోందని అసత్యాలు చెబుతున్నారని మండిపడ్డారు. అన్ని నియమనిబంధనల ప్రకారమే అనుమతి తీసుకుని నిర్మాణం జరుగుతుందన్నారు.కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)కి ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఇచ్చామని తెలిపారు. ఆమోదం లేకుండా డీపీఆర్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారని, ప్రాథమిక నివేదిక ఆమోదం తెలిపాక డీపీఆర్ ఇస్తామని మంత్రి తెలిపారు. పోలవరం–బనకచర్ల అనుమతులు నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని మరోసారి స్పష్టం చేశారు.

## ఏ రాష్ట్రానికీ నష్టం లేదు..

ఏపీ జలదోపిడీ అని తెలంగాణ నేతలు విమర్శిస్తున్నారని, వరద జలాలు ఉపయోగించుకోవడం తమ హక్కు అని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. దిగువ రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్ ఎగువ రాష్ట్రాల ప్రయోజనాలు... నీటి అవసరాలు తీరాక మాత్రమే వరద జలాలు ఉపయోగించుకుంటుందని మంత్రి వివరించారు. ఏ రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేదని, ప్రతి ఏడాది 3వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి పోతోందన్నారు. ప్రస్తుతం ఇంకా వర్షాకాలం పూర్తిగా రాకుండానే సముద్రంలోకి నీరు వృథాగా పోతోందని అన్నారు. గతంలో తెలంగాణలో కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టులకు సరైన అనుమతి తీసుకోలేదని ఆరోపించారు. పూర్తయిన ప్రాజెక్టులకే అనుమతి లేదని, ఇంకా ప్రారంభ దశలో ఉన్న ప్రాజెక్టుల అనుమతిపై మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రాజెక్టులను ఆపాలన్న దురుద్దేశం తమకు లేదని... సీఎం చంద్రబాబుకు అసలే లేదని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. సీతారాం సాగర్ లిఫ్ట్‌కు కూడా ఇటీవలే అనుమతి వచ్చిందని, కానీ అప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. దిగువ రాష్ట్రంగా గోదావరి వరద ముంపు కష్టాలను ఆంధ్రప్రదేశ్ ఎన్నో ఏళ్లుగా భరిస్తోందన్నారు. ఆ కష్టాలు, నష్టాలు భరిస్తున్న మన రాష్ట్రానికి వరద జలాలు వాడుకునే హక్కు సహజంగానే ఉంటుంది. గోదావరిలో ఏటా కనిష్ఠంగా 100 రోజుల పాటు వరద ఉంటుంది. వరదల సమయంలోనే రోజుకు 2 టీఎంసీల చొప్పున బనకచర్ల ప్రాజెక్ట్‌కు అవసరమైన 200 టీఎంసీలు తీసుకుంటాం. నికర జలాల తీసుకునే ఉద్దేశం ఆంధ్రప్రదేశ్‌కు లేదని మంత్రి నిమ్మల చెప్పారు

## ఎప్పుడూ అడ్డుకోలేదు..

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో దేవాదుల ఎత్తిపోతల పథకంతో పాటు చాలా ప్రాజెక్టులు చంద్రబాబు హయాంలోనే నిర్మించారు. ఎస్సార్‌ఎస్పీ, బీమా, గుత్ప, అలీసాగర్, ఎత్తిపోతల పథకాలకు కూడా చంద్రబాబు ఎంతగానో కృషి చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రాష్ట్ర విభజన జరిగాక కాళేశ్వరం, సీతారామసాగర్, సమ్మక్క బ్యారేజీలను తెలంగాణ ప్రభుత్వం అనుమతులు లేకుండా చేపట్టినప్పటికీ చంద్రబాబు ఎప్పుడూ అడ్డుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం మనకు ఎగువన ఉంది. సరైన సాంకేతిక మదింపు లేకుండా ఎగువన ప్రాజెక్టులు నిర్మిస్తే దిగువన అప్పటికే పూర్తయిన ప్రాజెక్ట్ కింద ఉన్న ఆంధ్రప్రదేశ్ రైతులు నష్టపోతారు. లోయర్ రైపేరియన్ రైట్స్ (దిగువ పరివాహక ప్రాంతాల ప్రత్యేక హక్కులు) అనేవి నదీజలాల జలాల చట్టంలోనే ముఖ్యమైన అంశం. చంద్రబాబు దీని గురించే చెప్పారు. అంతే తప్ప తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలనే దురుద్దేశాలు అప్పుడూ లేవు.. ఇప్పుడూ లేవని మంత్రి నిమ్మల తేల్చి చెప్పారు. దిగువ రాష్ట్రాలకు ఉన్న హక్కుల ప్రకారం చంద్రబాబు కొన్ని ప్రాజెక్టుల విషయంలో అభిప్రాయం చెప్పారు తప్ప అడ్డుకునే ప్రయత్నం చేయలేదన్నారు. ఈ విషయాన్ని తెలంగాణా ప్రజలు గుర్తించాలన్నారు.

## ద్వంద్వ వైఖరి

కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో మాట మాట్లాడుతున్నారు. 2016లో మొదటి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో రెండు రాష్ట్రాల ప్రయోజనాలకు అనుగుణంగా ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరించి నీటి పంపకాలు చేసుకుందామని సీఎం చంద్రబాబు తెలిపారు. దీనిపై అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ గోదావరి నదిలో వృథాగా పోయే 3000 టీఎంసీల జలాల్లో సాధ్యమైనంత మేర సమర్థవంతంగా వినియోగించుకుంటే రెండు రాష్ట్రాల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అపెక్స్ కౌన్సిల్లో ఇరు రాష్ట్రాల సీఎంల మాటలు మినిట్స్ రూపంలో నమోదై ఉన్నాయని మంత్రి నిమ్మల తెలిపారు. నాడు ఏపీలో జగన్ సీఎంగా ఉన్నప్పుడు మన రాష్ట్రానికి వచ్చిన కేసీఆర్.. రాయలసీమ నీటి సమస్య పరిష్కారానికి గోదావరి వరదజలాల తరలింపే మార్గమని పదేపదే చెప్పారు. అలాంటి కేసీఆర్ నేడు ప్రతిపక్షంలో ఉండి వరద జలాలను మాత్రమే వినియోగించుకునే బనకచర్లకు అడ్డు చెప్పటం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మంత్రి నిమ్మల ఆక్షేపించారు.

## జగన్ ఆంతర్యమేమిటి..

నాడు గోదావరి ఎగువ ప్రాంతం నుండి వరద సమయంలో రోజుకు 4 నుండి 5 టీఎంసీల చొప్పున 120 రోజుల్లో 400 నుండి 500 టీఎంసీల జలాల వరకు శ్రీశైలం తరలించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, తాను నిర్ణయించినట్లుగా నాటి సీఎం జగన్ సాక్షాత్తు అసెంబ్లీలోనే ప్రకటించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా నాడు గోదావరి జలాల తరలింపునకు అంగీకారం తెలిపిన కేసీఆర్ నేడు పోలవరం వద్ద వరద జలాల్లో 200 టీఎంసీలను తరలించే బనకచర్ల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకించటం అర్థరహితమని మంత్రి నిమ్మల అన్నారు. అప్పట్లో కేసీఆర్‌తో కలిసి గోదావరి వరద జలాల తరలింపుపై నిర్ణయం తీసుకున్న జగన్‌రెడ్డి.. నేడు రాయలసీమను సస్యశ్యామలంగా మార్చే బనకచర్ల ప్రాజెక్ట్‌ను అదే కేసీఆర్, ఆయన పార్టీ నాయకులు వ్యతిరేకిస్తుంటే నోరు మెదపకపోవటంలో ఆంతర్యం ఏమిటని మంత్రి నిమ్మల ప్రశ్నించారు. తెలంగాణ నేతల అభ్యంతరాలను రాయలసీమ బిడ్డగా చెప్పుకునే జగన్ ఎందుకు ఖండించటం లేదని నిలదీశారు.

ఎగువ రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం లేకుండా, వారి న్యాయబద్ధమైన అవసరాలు తీరాకనే.. కేవలం వృథాగా సముద్రంలో కలిసే వరద జలాల్లో 200 టీఎంసీలను మాత్రమే బనకచర్ల ప్రాజెక్ట్‌కు వినియోగించుకుంటామని స్పష్టంగా చెబుతున్నాం. సీడబ్ల్యూసీకి ఇదే విషయం తెలియజేశాం. ఎగువ రాష్ట్రాల హక్కులు హరించే దురుద్దేశం ఏ మాత్రం లేదు. అందరూ బాగుండాలి.. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు ఆలోచన అని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు.

## మద్యం స్కాం.. సిట్ పోలీసుల అదుపులో చెవిరెడ్డి

**– కొలంబో వెళుతుండగా బెంగళూరు విమానాశ్రయంలో అడ్డుకున్న అధికారులు**

అమరావతి(చైతన్యరథం): మద్యం కుంభకోణం కేసులో వైసీపీ నేత, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఏపీ సిట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఆయనను నిందితుడిగా చేర్చారు. ఎఫ్ఐఆర్‌లో ఏ38గా పేర్కొంటూ కోర్టులో మెమో దాఖలు చేశారు. అంతకుముందు మంగళవారం ఉదయం చెవిరెడ్డి బెంగళూరు నుంచి కొలంబో వెళ్లేందుకు ప్రయత్నించగా.. ఏపీ లిక్కర్ స్కాంలో ఆయనపై లుక్ అవుట్ నోటీసులు ఉండటంతో ఎయిర్‌పోర్టులో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని ఏపీ పోలీసులకు కెంపెగౌడ విమానాశ్రయ పోలీసులు తెలియచేయటంతో ఏపీ సిట్ అధికారులు బెంగళూరుకు బయలుదేరి వెళ్లి చెవిరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఆయనను విజయవాడ తరలిస్తున్నారు.

చైతన్యరథం

# ప్రజారోగ్య రంగంలో.. జవాబుదారీతనం, పనితీరు పర్యవేక్షణ తెచ్చాం



- పనితీరు ఆధారంగా పోస్టింగులు, బదిలీలు
- అక్రమాలకు, రాజకీయ జోక్యానికి అడ్డుకట్ట
- వారసత్వంగా వచ్చిన సమస్యల్ని అధిగమిస్తున్నాం
- కూటమి ప్రభుత్వ మొదటి ఏడాదిలో ప్రభుత్వ వైద్య రంగంలో మెరుగైన మార్పులకు శ్రీకారం
- ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించిన వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది పాలనలో ప్రజలకు మెరుగైన వైద్య సేవల్ని అందించే దిశగా సానుకూల వాతావరణాన్ని కల్పించి మంచి ఫలితాల్ని సాధించే దిశగా మొదటి అడుగు వేశామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రభుత్వ వైద్య రంగంలో భాగస్వాములైన అందరూ జవాబుదారీతనం, క్రమశిక్షణలతో వ్యవహరించడం.. అన్ని స్థాయిల్లో వైద్యులు, అధికారులు, ఇతర సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తూ ఫలితాల్ని మదింపు చేయడం.. బాగా పనిచేసిన వారిని ప్రోత్సహించడం, అక్రమాలు, రాజకీయ జోక్యాన్ని అడ్డుకోవడం.. వంటి అంశాల ఆధారంగా వైద్య సేవల్ని మెరుగుపర్చడానికి గత ఏడాది కాలంగా కృషి చేసినట్లు మంత్రి వివరించారు.

ఈ మేరకు మంత్రిగా బాధ్యతల్ని స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా మంత్రిత్వ శాఖ ప్రయత్నాలు, ఫలితాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకి 5 పేజీల వివరణాత్మక నివేదికను మంత్రి సత్యకుమార్ యాదవ్ సమర్పించారు. గతేడాది జూన్ 16న పదవీ స్వీకారం చేసిన మంత్రి ఈ నెల 16న ముఖ్యమంత్రికి తన నివేదికను పంపారు.

### క్రమశిక్షణ, జవాబుదారీతనం

గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనా వైఖరితో వైద్య సిబ్బందిలో గైరు హాజరీ, జవాబుదారీతనం లేకపోవడం, వివిధ స్థాయిల్లో పనితీరు, ఫలితాలపై పర్యవేక్షణ లోపించడం కారణంగా వైద్య సేవల నాణ్యత దెబ్బతిందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ వారసత్వంగా సంక్రమించిన ఈ సమస్యల్ని అధిగమించడానికి నిర్దిష్ట ప్రణాళికలతో కూటమి ప్రభుత్వం గత ఏడాదిగా చేసిన కృషి సత్ఫలితాల్ని ఇస్తోందని మంత్రి తన నివేదికలో ముఖ్యమంత్రికి వివరించారు. వైద్య సిబ్బంది హాజరు, ఓపీ, ఐపీ సేవల్లో కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సరం పాలనలో ఇతోధికంగా పెరుగుదలను సాధించామని, ఇది ప్రజారోగ్య రంగంలో వచ్చిన మార్పునకు నిదర్శనమని మంత్రి సత్యకుమార్ వివరించారు. తత్ఫలితంగా ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు ప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సర్వేల్లో ప్రభుత్వ వైద్య సేవల పట్ల సానుకూలత బాగా పెరిగిందని ఆయన తెలిపారు.

### ప్రశ్నించడం ద్వారా మెరుగైన పాలనా ప్రక్రియ

ఏ రంగంలోనైనా సత్ఫలితాల్ని సాధించడానికి సమగ్ర సమాచారంతో విశ్లేషణాత్మక ప్రతిపాదనలతో కూడిన నిర్ణయాలు ప్రధానమని మంత్రి అన్నారు. పరిపాలనా బాధ్యతల్ని పలు స్థాయిల్లో నిర్వహిస్తున్న వైద్యుల్లో పాలనా విషయాల్లో సరైన శిక్షణ, నిపుణత లోపించడంతో పాటు మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్న కింది, మధ్య స్థాయి అధికారుల సామర్థ్యంలో కొరత కారణంగా పలు అంశాలకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించడంలో సమగ్రత లోపించడాన్ని తాము గుర్తించామని, దీన్ని అధిగమించడానికి తన ప్రయత్నం చేశానని మంత్రి సత్యకుమార్ వివరించారు. అలాంటి లోపాలు తన దృష్టికొచ్చిన ప్రతిసారీ నిర్మొహమాటంగా తగు ప్రశ్నలు లేవనెత్తడంతో పాటు వివరణల్ని కోరడం ద్వారా దస్త్రాల్ని(ఫైళ్లు) సమర్పించే విధానంలో మార్పుల్ని తెచ్చామని ఆయన తెలిపారు. ఈ ప్రయత్నం సానుకూల ఫలితాల్ని ఇస్తోందని...యథాలాపంగా దస్త్రాల్ని పంపితే మంత్రి లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్న ఆలోచన అధికారుల్లో కలిగి వారు జాగ్రత్త వహిస్తున్నారని మంత్రి చెప్పారు.

### అక్రమాలు, రాజకీయ జోక్యానికి అడ్డుకట్ట

గత ప్రభుత్వ హయాంలో ప్రజారోగ్య రంగంలో నెలకొన్న అక్రమాలు, రాజకీయ జోక్యంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాస్థాయిలో జరిగిన వైద్య సిబ్బంది నియామకాల జాబితాలు కలెక్టర్ల కార్యాలయాల్లో కాకుండా మంత్రుల ఇళ్లల్లో తయారయ్యాయని, ఆ కాలంలో నెలకొన్న అవినీతి, అక్రమాలు, రాజకీయ జోక్యానికి ఇది అద్దం పట్టిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ నివేదికలో ముఖ్యమంత్రికి వివరించారు. ఈ వైఖరికి గతేడాదిలో అడ్డుకట్ట వేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే 8,000 పైగా వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాన్ని ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా చేపట్టామన్నారు. వివిధ నిర్మాణ పనులు, మందులు, పరికరాల కొనుగోళ్లలో నియమనిబంధనల ప్రకారం టెండర్లపై నిర్ణయాల్ని తీసుకున్నట్లు ఆయన వివరించారు.

### మెరుగైన పనితీరుకు ప్రోత్సాహం

గతానికి భిన్నంగా వివిధ స్థాయిల్లో మంచి పనితీరును కనపర్చిన వారిని ప్రోత్సహించే దిశగా తాము నిర్దిష్టమైన చర్యల్ని చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఈ మేరకు జిల్లా స్థాయి అధికారులైన డీఎంహెచ్వోలు, డీసీహెచ్ఎస్‌లతో పాటు ప్రభుత్వాసుపత్రుల సూపరింటెండెంట్లు, ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్ల పోస్టింగులు, బదిలీలు చేశామని ఆయన వివరించారు.

### వ్యత్యాసం

ఐదేళ్ల గత ప్రభుత్వ హయాంలో ప్రజారోగ్యానికి సంబంధించిన పలు అంశాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రి తెలిపారు. కేంద్రం నుండి కొత్త పథకాలు, నిధుల మంజూరులో ఈ విషయం స్పష్టమయ్యిందనిన్నారు. దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వ మొదటి ఏడాదిలోనే రూ.1,065 కోట్ల వ్యయంతో గ్రామ స్థాయిలో 3,318 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణానికి కేంద్ర అనుమతిని పొందామని, 10 నూతన క్రిటికల్ కేర్ బ్లాకులు, 13 సమీకృత ప్రజారోగ్య ప్రయోగ శాలలు మంజూరయ్యాయని, మున్నెనడూ లేని విధంగా ఆయుష్ సేవలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.83 కోట్ల కేంద్ర నిధుల మంజూరు, ఆహార పదార్థాల నాణ్యత నిర్ధారణ నిమిత్తం ప్రయోగశాలల నిర్మాణానికి రూ.90 కోట్ల కేంద్ర నిధులు పొందగలిగామని మంత్రి సత్యకుమార్ యాదవ్ నివేదికలో వివరించారు.

### కృషికి గుర్తింపు

క్షేత్ర స్థాయిలో ఆరోగ్య పథకాల అమలుపై నిరంతర పర్యవేక్షణ, ఫలితాల మదింపు ప్రాతిపదికన 2024-25 కాలంలో రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్ అమలు తీరును కేంద్ర ప్రభుత్వం ప్రశంసిస్తూ పనితీరుకు ప్రోత్సాహకంగా రాష్ట్రానికి రూ.100 కోట్లు విడుదల చేసిందన్నారు. మొదటి ఏడాదిలో రాష్ట్రంలో ప్రజారోగ్య సేవల్ని మెరుగుపర్చడానికి కూటమి ప్రభుత్వం చేసిన కృషికి ఇది సాక్షాత్కారమని ముఖ్యమంత్రి దృష్టికి మంత్రి సత్యకుమార్ తీసుకొచ్చారు.

### మార్పు తెచ్చాం-మరింతగా కృషి చేయాలి

కూటమి ప్రభుత్వం మొదటి ఏడాదిలో ప్రభుత్వ వైద్య రంగ పాలన, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో నిర్దిష్ట విధానాలతో ప్రజారోగ్య రంగంలో మార్పు తేగలిగామని...అయితే ముఖ్యమంత్రి ఆశయాల మేరకు ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన దిశగా చేయాల్సింది ఇంకా ఉందని, ఆమేరకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చారు.

# సంపాదకుల ఆక్రోశం ఎవరి మెప్పుకోసం?

పత్రికా స్వేచ్ఛ అణచివేత, ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని, ప్రభుత్వ చర్యలపై స్పందించకుంటే భవిష్యత్‌లో మరిన్ని తీవ్ర పరిణామాలంటూ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి కొందరు సంపాదకులు అందరూ కొమ్మినేని శ్రీనివాస రావును కీర్తిస్తూ ఏపీలో కూటమి ప్రభుత్వంపై ఆక్రోశించారు. గత ఐదేళ్లు ప్రజాస్వామ్యాన్ని, పత్రికా స్వేచ్ఛను జగన్ బూటుకాలితో నలిపేసినా నోరు తెరవని ఈ సంపాదకులు.. ఇప్పుడు ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ అంటూ రోధించడం రోతగా లేదా? అమరావతి రాజధాని ప్రాంత మహిళలను కించపరిచే విధంగా సాక్షి మీడియాలో మాట్లాడిన జర్నలిస్టు వ్యాఖ్యలను సమర్థించే విధంగా వ్యవహరించిన కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేస్తే ప్రజాస్వామ్యానికి, పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగి పత్రికా ప్రపంచమంతా స్తంభించి పోయినట్టు సంపాదకులు తెగ బాధపడిపోయారు. కొమ్మినేని అరెస్టుతో ప్రభుత్వ ఉద్దేశ్యం బయటపడిందంటూ సంపాదకులు ఉక్రోషం వెళ్లగక్కారు. అసలు మీడియాలో తప్పుడు విధానాలకు తెరతీసింది ఎవ్వరు? సాక్షి యాంకర్‌ను అరెస్టు చేస్తే అక్రమం అని శోకాలు పెట్టడం ఏమిటి? మీడియా ముసుగులో దారుణమైన వ్యాఖ్యలు చేసి వ్యక్తిత్వహననానికి పాల్పడి అవమానించినా ఈ సంపాదకులు సమర్థిస్తారా? వీరు సమాజం పక్షమా? లేక మహిళలను అవమానించినవారి పక్షమా? అని నిలదీస్తున్నారు మహిళలు. ప్రజాస్వామ్యానికి, పత్రికా స్వేచ్ఛకి గొడ్డలిపెట్టు అంటూ సంపాదకులు గుండెలు బాదుకొన్నారే, మరి అమరావతి వేశ్యల రాజధాని అంటూ చేసిన వ్యాఖ్యలను మీరు సమర్థిస్తున్నారా? మీకు నచ్చిన మీడియాలో చేసిన బూతులను, అరాచకాలను దాచిపెట్టడమే నిఖార్సయిన జర్నలిజం అనుకొంటున్నారా? సంపాదకులు కోరుకొంటున్న జర్నలిజం సమాజానికి ఉపయోగపడదని గుర్తించాలి. పూర్వం రాజులు ఆస్థానంలో పొగడ్తల కోసం కొంతమంది ప్రత్యేకంగా ఉండేవారట. ఆ విధంగానే నేడు జగన్‌రెడ్డి ఆస్థానంలో చేరారు అలాంటి వారు.

అమరావతి మహిళలపై సాక్షి మీడియాలో బరితెగించి చేసిన వికృత వ్యాఖ్యలు చూసి సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకుంది. సభ్యతమరచి ఆవేశంతో విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి మహిళలను ఘోరంగా అవమానించారు. క్రూరమైన, వికృతమైన ఆలోచనకు ప్రతిరూపమే ఇలాంటి వ్యాఖ్యలు. మహిళలను అవమానించే విధంగా మాట్లాడిన వ్యక్తి మాటలను ఖండించని వ్యక్తిపై ప్రశంసల జల్లులు కురిపించడం దేనికి సంకేతం? ఆ వ్యాఖ్యలను సంపాదకులు కూడా సమర్థిస్తున్నట్లే కదా. మానవత్వంలేని అత్యంత క్రూర ఆలోచనలున్నవారే ఇలా వ్యవహరిస్తారు. అటువంటివారికి సంపాదకులు మద్దతుగా నిలిస్తే ప్రజలు తమను తాము కాపాడుకోవడం తప్ప మరో మార్గం లేదు. అయినా ప్రజాస్వామ్యానికి, పత్రికా స్వేచ్ఛకి గొడ్డలిపెట్టు అంటున్న ఈ స్వచ్ఛ సంపాదకులకు అవి ఇప్పుడే గుర్తుకు వచ్చాయా? గతంలో మీడియా వాచ్ పేరుతో 2007లో మీడియాపై ఆంక్షలు విధించాలని వైఎస్ రాజశేఖరరెడ్డి 938 జీవో తెచ్చారు. తర్వాత ఆయన తనయుడు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మీడియా గొంతు నులిమేందుకు జీవో 2430ని జారీ చేసారు. తర్వాత జీవో 1తెచ్చి రాష్ట్రానికే సంకెళ్లు వేసారు. మరి ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ పరిఢవిల్లాలని కోరుకొనే ఈ సంపాదక వర్గానికి ఆ రోజు కనపడలేదా? ఈ రోజు ప్రజాస్వామ్యానికి, పత్రికా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు అంటూ వగచే ఈ సంపాదకులు అప్పుడు ఎందుకు మాట్లాడ లేదు.? స్వార్ధ సంపాదకులు ప్రవచించె నీతుల కింద నిజం కప్పబడింది.

సీనియర్ సంపాదకులమంటూ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వాన్ని నిందించారు. మరి గత ప్రభుత్వంలో మీడియా స్వేచ్ఛను హరించినప్పుడు ఏమయ్యారు ఈ సంపాదకులు? ప్రజాస్వామ్యానికి, పత్రికా స్వేచ్ఛకీ గొడ్డలి పెట్టు అంటూ గగ్గోలు పెడుతున్న ఈ సంపాదకులు వీటికి సమాధానం చెప్పాలి. సాక్షి యాంకర్‌ను అరెస్టు చేస్తే ఏదో జరిగిపోయినట్టు ప్రభుత్వంపై విషం కక్కడం ఎవరిమెప్పు కోసం? ఎవరి కళ్ళల్లో ఆనందం చూడటానికి? ఒకపక్కన పచ్చిగా నిజానిజాలతో నిమిత్తం లేకుండా పత్రికా విలువలకు తిలోదకాలిచ్చి పచ్చి అబద్దాల, అరాచక రాతలు వ్రాస్తున్నా ఎన్నడూ నోరు తెరవని ఈ సంపాదకులు విలువలు, కక్ష సాధింపు, ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ అంటూ పెద్ద,పెద్ద డైలాగులతో గురివింద నీతులు వల్లించడం విడ్డురంగా లేదా? మీడియా ముసుగులో నిత్యం గిట్టనివారిపై ఇష్టానుసారం బూతు రాతలు అచ్చేస్తూ.. ఏదిపడితే అది రాసేందుకు రెండుమూడు పేజీలు కేటాయించి.. ఉన్నదీ లేనిదీ గాలి పోగేసి విషపు రాతలు రాస్తున్నా.. ఆ తప్పుడు కథనాలు తప్పు అనిపించడంలేదా? వివేకా హత్య అనంతరం మీకు నచ్చిన సాక్షి పత్రికలో నారాసుర రక్తచరిత్ర అంటూ రాసిన అభూత కల్పన కథనాన్ని ఈ సంపాదకులు ఎందుకు ఖండించలేదు? ఆ రోజు ఆ కథనం ఈ సంపాదకులకు శభాష్ అనిపించిందా? అది ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛనా? జగన్ ఏలుబడిలో జర్నలిస్టులు, పత్రికలపై, పత్రికా కార్యాలయాలపై రాళ్ళ దాడులు చేయడం మున్నెన్నడూ చూడలేదు. ఆంధ్రజ్యోతి పత్రిక ఫొటో జర్నలిస్టుపై జెండా కర్రలతో దాడి చెయ్యడం, వెంటాడి కొట్టడం, కింద పడేసి కాలితో తొక్కుతూ చంపే ప్రయత్నం చెయ్యడం -కర్నూలులో వందలమంది వైసీపీ కార్యకర్తలు ఈనాడు కార్యాలయంపై దాడి చేసి విధ్వంసం సృష్టించడం.. పత్రికా స్వేచ్ఛను, భావ ప్రకటనా స్వాతంత్రాన్ని కబళించడం కాదా?

మూడు మీడియా వ్యవస్థలను అసెంబ్లీకే రాకుండా అడ్డుకొన్నా, ఏపీలో రెండు ఛానళ్లను నిలిపివేసినా, మీడియా వ్యవస్థల ప్రతినిధులపై, జర్నలిస్టులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టినా ప్రజాస్వామ్యం, పత్రికాస్వేచ్ఛ ఈ సంపాదకులకు గుర్తు రాలేదా? మీరు చెప్పిన నీతులు మీకు నచ్చినవారికి వర్తించవా? మీరు నచ్చినవారికి ఒక రూలు, మీకు నచ్చని వారికి మరొక రూలు ఉంటుందా? మీరు ఈరోజు ఒకవైపే వత్తాసు పలకడాన్ని ఏమని అర్థం చేసుకోవాలి? మహిళను అవమానాలకు గురి చేసే వ్యాఖ్యలు చెయ్యడం, వ్యక్తిత్వ హననం చెయ్యడం వంటివి భావ ప్రకటనా స్వేచ్ఛ పరిధిలోకిరావని మీకు తెలియదా? రూల్ ఆఫ్ లా సాక్షి యాజమాన్యానికి, సాక్షిలో పనిచేసే సిబ్బందికి వర్తించదా? ఆంధ్రజ్యోతి సహా ఇతర ఛానెళ్లను ఐదేళ్లపాటు నిలిపి వెయ్యడం? ఆంధ్రజ్యోతికి, ఏబీఎన్ ఛానల్‌కు ఐదేళ్లు న్యాయంగా ఇవ్వాల్సిన ప్రకటనలు ఒక్కటికూడా ఇవ్వకపోవడం పత్రికా స్వేచ్ఛనా? మీకు నచ్చిన ప్రభుత్వ తీరు భావ ప్రకటనా స్వేచ్ఛకు ఆర్టికల్ 19 (1)కు విరుద్ధంగా లేదా? ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలకు విరుద్ధంగా గత ప్రభుత్వం వ్యవహరిస్తే ఈ మహాసంపాదక వర్గం ఎందుకు మాట్లాడలేదు? అధికారం కోల్పోయిన తర్వాత కూడా సాక్షి పత్రిక, ఆ ఛానెల్ ప్రజా ప్రతినిధులను అవమానించేలా దుష్ప్రచారం చేస్తున్నా ఈ సంపాదకులకు కనపడటం లేదా? అందుకే సంపాదకుల ఆక్రందనలు, ఆక్రోశం ఎవరిమెప్పు కోసమో, ఎవరి కళ్లలో ఆనందం చూడటం కోసమో అర్థం చేసుకోలేనంత అమాయకులు మాత్రం కాదు ఆంధ్రప్రదేశ్ ప్రజలు.

- నీరుకొండ ప్రసాద్

# ఏపీకి కేంద్రం శుభవార్త

- కామన్ సెంట్రల్ సెక్రటేరియట్‌కు నిధులు
- అమరావతిలో కేంద్ర ఉద్యోగుల క్వార్టర్స్
- రూ.2,787 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు
- 2018లోనే ఈ ప్రాజెక్టుకు టీడీపీ ప్రతిపాదనలు
- గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆలస్యం
- నేడు శాఖాపరంగా చర్యలతో నిధుల సాధన
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



న్యూఢిల్లీ: ఏపీ ప్రజలకు కేంద్రం శుభవార్త చెప్పింది. సెంట్రల్ కామన్ సెక్రటేరియట్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల క్వార్టర్స్ నిర్మాణం నిమిత్తం అమరావతిలో నిర్మితమయ్యే భవనా లకు సుమారు రూ.2,787 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అందుకు సంబంధించిన అనుమతులను కేంద్ర ప్రభు త్వ హౌసింగ్ అండ్ అర్బన్ శాఖకు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ మంగళవారం జారీ చేసింది. అందులో అమరావతిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు క్వార్టర్స్ నిర్మాణం నిమిత్తం రూ.1,329 కోట్లు, నూతన రాజధాని అమరావతిలో నిర్మించాల్సిన కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ (సీసీఎస్) ప్రాజెక్టుకు రూ.1,458 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపింది. 2018లోనే ఈ ప్రాజెక్టుకు నిధు లు మంజూరుకావాల్సి ఉన్నప్పటికీ ప్రతిపాదనల అనంతరం ప్రభుత్వం మారడంతో ఆ అవి పెండింగ్‌లో పడ్డాయి. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనల గురించి పట్టించు కోలేదు. దీంతో రాజధానిలో నిర్మాణాల ప్రసక్తే లేకుండా పోయింది. ఫలితంగా ప్రతిపాదిత ప్రాజెక్టుకు ఇప్పటివరకు ఆర్థిక ఆమోదం రాకపోవడం వల్ల నిర్మాణం ఆలస్యమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకోవడంతో ఈ కీలకమైన ఆమో దం సమకూరింది. నిర్మాణ బాధ్యతలను సీపీడబ్ల్యూడీ చేపట్ట నుంది. ఈ మంజూరుతో అమరావతిలో కేంద్ర ప్రభుత్వ మౌలిక అవస రాలకు సంబంధించిన నిర్మాణం వేగవంతం కానుంది. కామన్ సెక్రటేరియట్ ద్వారా కేంద్ర శాఖలను ఒకే ప్రాంతంలో సమీకరించడం ద్వారా పరిపాలన సౌలభ్యం మరింత పెరు గుతుంది. ఈ ప్రాజెక్ట్ ఆమోదం పొందడంలో కూటమి ప్రభుత్వ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, పవన్‌కళ్యాణ్ ప్రాధాన్యం, యువనేత నారా లోకేష్ సమన్వయం ముఖ్యపాత్ర పోషిం చాయి. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ఇది కూటమి ప్రభుత్వ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి కేంద్రం చూపిన విశ్వా సానికి నిలువెత్తు నిదర్శనం. ఇందుకు సహకరించిన నరేంద్ర మోదీ, కేంద్ర గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## రేణిగుంట ఎయిర్‌పోర్టుకు శ్రీవారి పేరు

- మార్చేందుకు కేంద్రానికి సిఫార్సు
- బెంగళూరులో ఆలయ నిర్మాణం
- అర్చకులకు శిక్షణా కార్యక్రమాలు
- టీటీడీ పాలకమండలి నిర్ణయం



తిరుమల (చైతన్యరథం): టీటీడీ ధర్మకర్తల మండలి అత్యవసర భేటీ మంగళవారం జరిగింది. అనంతరం సమావేశ వివరాలను చైర్మన్ బి.ఆర్.నాయుడు మీడియాకు వెల్లడించారు. రేణిగుంట ఎయిర్‌పోర్టుకు శ్రీవారి పేరు పెట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. అందుకోసం ఏవియేషన్ సంస్థకు లేఖ రాయాలని నిర్ణయం తీసు కున్నట్లు తెలిపారు. అలాగే కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎం అభ్యర్థ న మేరకు బెంగళూరు ప్రధాన ప్రాంతంలో శ్రీవారి ఆలయం నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు కావాల్సిన 47 ఎక రాల స్థలాన్ని కర్ణాటక ప్రభుత్వం కేటాయించగానే ఆలయం నిర్మిం చేందుకు చర్యలు చేపడతామని వివరించారు.

**టీటీడీకి 100 ఎలక్రికల్ బస్సులు**

కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి.కుమారస్వామి టీటీడీకి 100 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించేందుకు హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి త్వరలోనే బస్సులను తిరుమలకు తీసు కొచ్చేందుకు చర్యలు చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం తిరుపతిలో ఏర్పాటు చేయనున్న సీఎస్ఐఆర్ ల్యాబ్‌కు లీజు పద్ధతిలో టీటీడీ స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించారు. తద్వారా టీటీడీ వినియోగించే నెయ్యి, నీరు, ఆహార పదార్థాల నాణ్యతను ఉచితంగా తనిఖీ చేసేందుకు అవకాశం కలుగుతుంది. న్యూఢిల్లీలోని ప్రతి ష్టాత్మక టీటీడీ కళాశాలను ఆధునికీకరించాలని నిర్ణయించారు. అలాగే టీటీడీలో లెక్చరర్ పోస్టుల భర్తీని నిలిపివేయాలని ఏపీపీ ఎస్సీకి సిఫార్సు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇప్పటికే పని చేస్తున్న 200 మంది కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యను పరిష్కరిం చేందుకు సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**అర్చకులకు, విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు**

సమరసతా సేవా ఫౌండేషన్ సహకారంతో ప్రస్తుతం నిర్వ హిస్తున్న అర్చకుల శిక్షణతో పాటు వివిధ వ్రతాలు, పూజా విధా నాలలో కూడా శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు వివ రించారు. టీటీడీకి చెందిన ఏడు పాఠశాలల్లోని దాదాపు 1600 మంది విద్యార్థులకు హైందవ సనాతన ధర్మం, మానవీయ విలువలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో శిక్షణ ఇవ్వడానికి సద్గమయ కార్యక్రమాన్ని డే స్కాలర్ విధానంలో శిక్షణ ఇచ్చేందుకు నిర్ణ యించినట్లు తెలిపారు. హిందూ సనాతన ధార్మిక విలువలతో పాటు తెలుగు సాంస్కృతిక వైభవంలో శిక్షణ ఇచ్చేందుకు మన వారసత్వం అనే కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వరలక్ష్మీ వ్రతం పర్వదినాన తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో సౌభాగ్యం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణ యించారు. అదేవిధంగా అక్షర గోవిందం, హరికథా వైభవం, భగవద్గీత అనుష్టాన బోధన, భజే శ్రీనివాసం, వన-నిధి, గిరి జనా ర్ధనం, సన్మార్గం వంటి కార్యక్రమాలను నిర్వహించి జన బాహు ళ్యంలోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అత్యవసర భేటీలో టీటీడీ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## అత్యంత ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**విశాఖలో నిర్వహించడం మన అదృష్టం - సమీక్షలో హోం మంత్రి అనిత**



విశాఖపట్నం (చైతన్యరథం): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖపట్నంలో నిర్వహించడం నగర వాసుల అదృష్టమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. నగరంలో ఈనెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర వేడుకలపై సహచర మంత్రులు అచ్చెన్నాయుడు, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, బీసీ జనార్ధన్రెడ్డి, అనగాని సత్యప్రసాద్‌తో కలిసి అధికారులతో వీఎంఆర్డీఏ కార్యాలయంలో మంగళవారం మంత్రి అనిత ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ యోగా దినోత్సవాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారన్నారు. ఐదు లక్షల మంది హాజరయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా మార్చేందుకు ముందుకెళ్తున్నాం. ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన గొప్ప కానుక యోగా. అది జీవితంలో ఒక భాగం, నగరంలో యోగా దినోత్సవానికి 326 కంపార్ట్‌మెంట్లు.. 2 వేలకు పైగా సీసీ కెమెరాలను సిద్ధం చేశాం. ట్రాఫిక్ సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపడుతున్నాం. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ఒక మ్యాట్, టీ షర్ట్, ఓఆర్ఎస్ బాటిల్ ఇవ్వనున్నాం. వర్షం వస్తే ఇబ్బంది లేకుండా ఏయూలో ఏర్పాటు చేస్తున్నాం. విశాఖ వాసులంతా యోగా వేడుకల్లో పాల్గొనాలని మంత్రి అనిత పిలుపునిచ్చారు.

## జూన్ 21న ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూస్తుంది

- యోగాడే తో నగరానికి అంతర్జాతీయ గుర్తింపు
- ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలి
- విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి
- యోగాంధ్ర అవగాహన సదస్సుల్లో పాల్గొన్న మంత్రి



విశాఖపట్నం (చైతన్యరథం): యోగాంధ్ర కార్యక్రమంతో విశాఖకు అంతర్జాతీయ గుర్తింపు దక్కుతుందని విశాఖ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం నాడు విశాఖ తూర్పు, దక్షిణ, ఉత్తర నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, కూటమి నేతలతో కలిసి యోగాంధ్ర అవగాహన సదస్సుల్లో పాల్గొన్న మంత్రి డోలా మాట్లాడుతూ.... జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూస్తోందన్నారు. యోగాంధ్ర కార్యక్రమంతో విశాఖకు అంతర్జాతీయ గుర్తింపు దక్కుతుంది. ఈ కార్యక్రమం గిన్నిస్ బుక్ రికార్డుల్లో ఎక్కి చరిత్రలో చిరస్థాయిగా నిలవనుంది. విశాఖ అంటే సీఎం చంద్రబాబు నాయుడుకి అమితమైన అభిమానం, హుద్ హుద్ సమయంలో బస్సులో ఉండి ఇక్కడే పరిస్థితులన్నీ చక్కదిద్దారు. విశాఖ కేంద్రంగా 8 జిల్లాలతో ఎకనామిక్ జోన్ ఏర్పాటు చేసి విశాఖను మరో ముంబైగా మార్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రణాళికలు రూపొందించారు. యోగాంధ్ర కార్యక్రమంతో విశాఖ ఖ్యాతి మరింత పెరగనుంది. యోగాంధ్ర కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి డోలా పిలుపునిచ్చారు.

# ప్రధాని పర్యటన ముందు అల్లర్లకు జగన్ స్కెచ్

- శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్రలు
- నాగమల్లేశ్వరరావు చావుకు జగన్‌రెడ్డే కారణం
- ఏడాది తర్వాత విగ్రహంతో శవ రాజకీయాలు
- నాడు తాడేపల్లి ప్యాలెస్ నుంచి బెట్టింగుల పర్వం
- పార్టీ గెలుస్తుందని కార్యకర్తలనూ వంచించారు
- వైసీపీ నేతల ఫేక్ ప్రచారాలు నమ్మి బెట్టింగ్
- డబ్బులు కట్టలేక ఆత్మహత్యకు ఒడిగట్టాడు
- అప్పటికీ కూటమి ప్రభుత్వమే ఏర్పడలేదు..
- ప్రభుత్వ వేధింపులతో అంటూ విషప్రచారం
- ఇది ముమ్మాటికీ జగన్‌రెడ్డి ప్రేరేపిత హత్యే
- పర్యటనల పేరుతో హింసాత్మక అలజడులు
- సత్తెనపల్లి పర్యటన దేని కోసం.. ఎందుకోసం?
- అధికారం పోయి ప్రజల మీద దండయాత్ర
- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



మంగళగిరి (చైతన్యరథం): జగన్ కుట్ర ఆలోచనలతోనే రాష్ట్రం లో రాజకీయ పర్యటనలు చేస్తున్నాడని పొన్నూరు ఎమ్మెల్యే ధూళి పాళ్ల నరేంద్రకుమార్ ధ్వజమెత్తారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయనది పరామర్శ కాదని.. సమస్యల సృష్టికి చేస్తున్న కుట్రల స్కెచ్ అది అని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పేరుతో జగన్ చేస్తు న్న హింసా రాజకీయాలు, కుట్ర ఆలోచనలు ప్రజలు గమనించా లని కోరారు. ఒక ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా శవ రాజ కీయాలు చేయడం ఎక్కడా లేదని.. ఏడాది కాలంలో ఏరోజూ ప్రజా సమస్యలపై స్పందించకుండా.. అసెంబ్లీకి వచ్చి మాట్లాడ కుండా శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు యత్నించడం సిగ్గుచేటని మండిపడ్డారు. గత ఐదేళ్లు ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవా దాన్ని నడిపిన జగన్‌రెడ్డి..పాలనలో జై జగన్ అననందుకు నడి రోడ్డుపై పట్టపగలు తోట చంద్రయ్య పీక కోసి చంపారు. కడపలో సుబ్బయ్య అనే బీసీ నాయకుడిని చంపారు. మాస్క్ అడిగినందుకు సుధాకర్ అనే వైద్యుడిని నడిరోడ్డుపై ఈడ్చి చంపారు. ఈ సంఘ టనలు నేటికీ సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి. అధికారం కోల్పో యాక కూడా జగన్‌రెడ్డి అరాచకాలు దౌర్జన్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. అధికారం కోల్పోయానన్న అసహనం, మహిళలు తన కు ఓట్లు వేయలేదన్న అసూయతో వారి గౌరవాన్ని, ఆత్మాభి మానాన్ని దెబ్బతీసేలా సాక్షి ఛానల్‌లో విమర్శలు చేయిస్తున్నాడు. జగన్ పర్యటనలు ప్రజల కోసం కాదు, ఆయన ప్రజల మీద దండ యాత్ర చేస్తున్నాడు. మిర్చి రైతుల పరామర్శకు వచ్చి మిర్చి బస్తా లు దొంలించుకుపోయిన వ్యక్తులకు నాయకుడు జగన్‌రెడ్డి. కుట్ర పూరితమైన పర్యటనలతో రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘా తం కలిగించాలని చూస్తున్నాడని ధ్వజమెత్తారు.

## ప్రధాని పర్యటన నేపథ్యంలో జగన్ స్కెచ్

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ యోగా డే జరగనుంది. ప్రపంచం గుర్తించేలా ఆ రోజు యోగా డే సక్సెస్ చేసేం దుకు అంతా నిమగ్నమై ఉన్నారు. స్వయంగా ప్రధాని వస్తున్నా రు. ఇలాంటి సమయంలో లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టించేం దుకు జగన్ స్కెచ్ వేశాడు.. అందులో భాగమే పల్నాడులో పర్యటన. ఇది జగన్‌కు అలవాటు అయిన వ్యవహారం. ఒకసారి గతం గుర్తు చేసుకుంటే.. నాడు విశాఖలో తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో పెట్టుబడుల సదస్సు జరుగు తుంటే... అనుమతి లేకుండా విశాఖ వచ్చి ఎయిర్ పోర్టులో నానా రభస సృష్టించాడు. గత ఏడాది కాలంగా జగన్ పర్యట నలు చూస్తేనే అతని క్రిమినల్ ఐడియాలజీ మనకు అర్థం అవు తుంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం.. రాష్ట్ర బ్రాండ్ దెబ్బతీయడమే అతని లక్ష్యం. పొగాకు రైతుల పరామర్శ పేరు తో పొదిలికి వైసీపీ రౌడీమూకలను తీసుకువచ్చి మహిళలపై చెప్పులు, రాళ్లు, బీరు బాటిళ్లతో దాడి చేయించాడు. పొగాకు బస్తాలను నాశనం చేశారు. ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. తెనా లిలో గంజాయి బ్యాచ్, రౌడీషీటర్ కుటుంబాలను పరామర్శించి రౌడీషీటర్లకు నిస్సిగ్గుగా మద్దతిచ్చారు. వాళ్లు మంచివాడు అంటూ కితాబు ఇచ్చి గంజాయి బ్యాచ్‌ను ప్రోత్సహించాడు. అనంతపురం జిల్లా రాప్తాడు పర్యటనలో హెలికాప్టర్ పేరుతో డ్రామాకు తరలేపాడు. పథకం ప్రకారం వైసీపీ మూకలతో హెలి కాప్టర్స్ దాడి చేయించుకుని పోలీసుల వైఫల్యం అంటూ తప్పు డు ప్రచారం చేశాడు. ఇదంతా జగన్ అనుసరిస్తున్న క్రిమినల్ ఐడియాలజీ గొడవలు సృష్టించి రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవు అని చెప్పడమే జగన్ కుట్ర అని మండిపడ్డారు.

## ఏడాది తర్వాత శవ రాజకీయం

అందులో భాగంగానే బెట్టింగ్‌లో నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ఏడాది తరువాత విగ్రహావిష్కరణ పేరుతో కొత్త కుట్రకు మళ్లీ తెరతీశాడు. పరామర్శ పేరుతో హడావుడి చేస్తున్నాడు. అందుకే జగన్ సత్తెనపల్లిలో కొర్లకుంట నాగ మల్లే శ్వరరావు ఇంటికి వెళుతున్నాడు. ఆయన వెళ్లడం తమకు అభ్యంతరం లేదు..పరామర్శ చేసుకోవచ్చు.. ఏడాదిగా మేం ఏ రోజూ ఆయనను ఆపలేదు..ఆంక్షలు పెట్టలేదు. హౌస్ అరెస్టు చేయలేదు. జీవో 1 లాంటిది తెచ్చి కట్టడి చేయలేదు. వాళ్లు కట్టినట్లు గేట్లకు తాళ్లూ కట్టలేదు. ఎక్కడికి వెళతానంటే అక్కడకి వెళ్లనిచ్చాం. పూర్తి ప్రజాస్వామ్యంగా వ్యవహరించాం. అయితే జగన్ ప్రత్యేకమైన కుట్రకోణంలోనే పర్యటనలు పెట్టుకుంటు న్నాడు. సత్తెనపల్లి పర్యటన కూడా అందులో భాగమే. నాగమ ల్లేశ్వరరావు వైసీపీ గెలుస్తుందని బెట్టింగ్‌కు పాల్పడి ఓడిపోయి ఆ డబ్బులు కట్టలేక గత ఏడాది జూన్ 9న ఆత్మహత్య చేసుకు న్నాడు. చనిపోయి ఏడాది దాటింది.. అతని చావుకు కారణం కూడా జగన్‌రెడ్డే. చనిపోయాక ఆ బెట్టింగ్ డబ్బులు కొంతమేర అతని తండ్రి చెల్లించాడు. ఇందులో టీడీపీ కక్ష సాధింపు చర్యల కు పాల్పడింది ఎక్కడ? టీడీపీ ప్రభుత్వం వేధించింది ఎక్కడ? జగన్ పర్యటనలు చేసుకోవచ్చు..కానీ కుట్రలు చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాజకీయ ముసు గులో కుట్రలను రాష్ట్రంలో సహించేది లేదన్నారు. ప్రజాహితం కంటే తమకు ఏదీ ముఖ్యం కాదు.. లా అండ్ ఆర్డర్‌కు, ప్రజా రక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. ప్రజలు వాస్తవాలు అర్థం చేసుకోవాలి..జగన్‌రెడ్డి డ్రామాలు గమనించాలని సూచించారు.

# వైసీపీ జెడ్పీటీసీ భర్త భూకబ్జా.. దౌర్జన్యం

- భూమిలోకి వస్తే చంపుతామని బెదిరింపు
- ప్రజావినతుల్లో తిరుపతి వాసి ఫిర్యాదు
- ప్రాణరక్షణ కల్పించాలని వివాహిత వేడుకోలు
- వైసీపీ ప్రభుత్వ మోసంపై ఎస్సీ రైతుల ఆవేదన
- అర్జీలు స్వీకరించిన ప్రతిభాభారతి, ముస్తాక్ అహ్మద్





మంగళగిరి(చైతన్యరథం): వైసీపీ జెడ్పీటీసీ భర్త భానుకుమా ర్‌రెడ్డి, కె.చంద్రశేఖర్‌రెడ్డి, సాయికుమార్ అనే వ్యక్తులు తప్పుడు వేలిముద్రలతో దౌర్జన్యంగా తమ భూమిలోకి ప్రవేశించి తాము వస్తే చంపుతామని బెదిరిస్తున్నారని తిరుపతి జిల్లా రామచంద్రా పురం మండలం సంజీవరాయపురం గ్రామానికి చెందిన పి.వెం కటరమణారెడ్డి ఫిర్యాదు చేశారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమ భూమిని సర్వే చేసి తమకు అప్పగించాలని కోరారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతుల స్వీకరణ కార్య క్రమంలో మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్‌లకు ఈ మేరకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

తమ కుటుంబ గొడవలతో ఎటువంటి సంబంధం లేని నిమ్మల రాజేంద్రప్రసాద్, జిలుగు వంశీ, నాగళ్ల కొండలరావు, శివదాసు, ఉన్నం శ్రీను, చింతా రామకృష్ణ, రామిశెట్టి గోపి, కోలా తిరుమలరావు తమ ఇంట్లోకి ప్రవేశించి తనతో పాటు తన భర్తను చంపేందుకు యత్నించారని ఎన్టీఆర్ జిల్లా వీరుల పాడు మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన టి.లావణ్య ఫిర్యాదు చేసింది. వారిపై కఠిన చర్యలు తీసుకుని తమ ప్రాణా లకు రక్షణ కల్పించాలని అభ్యర్థించారు.

సన్న, చిన్నకారు రైతులను ఆదుకునేందుకు ఉచిత బోరు పథకం ఉన్నా గత ప్రభుత్వం ఎస్సీ రైతులను అసలు పట్టించు కోలేదని ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం గొల్లమంద గ్రామానికి చెందిన తేనేటి ఇమ్మానేయులు, పలువురు రైతులు ఆవే దన వ్యక్తం చేశారు. మెట్ట ప్రాంతంలో ఉన్న తమకు బోర్లు మం జూరు చేసి ఎస్సీ రైతులకు కూటమి ప్రభుత్వం సాయం చేయాల ని గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

గత సంవత్సరం ఎన్నికల కోడ్ ఉండగా శ్రీనివాసులరెడ్డి అనే వ్యక్తి తమ ఇళ్లను ధ్వంసం చేసి పోలీసుల ముందే తమపై దాడి చేశాడని తిరుపతి రూరల్ మండలానికి చెందిన మోహన్‌నా యక్ ఫిర్యాదు చేశాడు. ఆయనపై చర్యలు తీసుకుని తమ ఎనిమి ది కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.



తాను టీడీపీకి అనుకూలంగా ఉండటంతో తనకు వస్తున్న పింఛన్‌ను వైసీపీ కార్పొరేటర్ తీయించాడని, పింఛన్‌ను పునరు ద్ధరించాలని గుంటూరు తారకరామనగర్‌కు చెందిన షేక్ గౌస్ బాషా అభ్యర్థించారు.

తమ తాత ముత్తాతల నుంచి తిరుమల సూరాపురం తోటలో ఉంటూ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న తమను యాత్రికు ల సౌకర్యార్థం ఖాళీ చేయించి ఇంటికి బదులు ఇల్లు, వాలంటీర్ ఉద్యోగం, షాపులు ఉన్న వారికి ప్రత్యామ్నాయ షాపులు ఇస్తామని గత ప్రభుత్వంలో మోసగించారని వి.శివకుమార్ ఫిర్యాదు చేశా డు. న్యాయం చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

# త్వరలో దేశంలోనే నెంబర్ వన్‌గా ఏపీ

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఉద్ఘాటన
- రాష్ట్రంలో జోడు గుర్రాల్లా అభివృద్ధి, సంక్షేమం పరుగులు
- తరలిపోయిన పరిశ్రమలను వెనక్కి తీసుకొస్తున్నాం
- పారిశ్రామిక హబ్‌గా రాయలసీమ
- 'తల్లికి వందనం'పై జగన్ వి తప్పుడు ఆరోపణలు
- మద్యం కేసు విచారణలో ప్రభుత్వ జోక్యం లేదు



గోరంట్ల: త్వరలో దేశంలోనే ఏపీ నెంబర్ వన్ రాష్ట్రంగా ఆవిర్భవించం ఖాయమని, గత ప్రభుత్వం వేధింపులు తాళలేక రాష్ట్రం నుంచి తరలిపోయిన పరిశ్రమలను వెనక్కి తీసుకొస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ నెల 21న అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించనున్నామన్నారు. మద్యం కుంభకోణం విషయంలో చట్టం తనపని తాను చేసుకుపోతోందని, ఇందులో ఎవరి జోక్యమూ లేదని స్పష్టంచేశారు. పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనే నిమిత్తం మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు వచ్చిన సందర్భంగా ఆమె తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏపీలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున అమలవుతున్నాయన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను సీఎం చంద్రబాబు అమలుచేస్తున్నారన్నారు. వితంతు, వృద్ధాప్య పెన్షన్లతో పాటు దివ్యాంగుల పెన్షన్లు పెంచామన్నారు. స్పౌజ్ పెన్షన్లను కూడా అందజేయబోతున్నామన్నారు. పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. ఉచిత ఇసుకతో పాటు మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను అందజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో భారీ ఎత్తున రహదారులను నిర్మిస్తున్నామన్నారు. పాఠశాలలు, హాస్టళ్లు, ఇంటర్ కళాశాల్లో సన్న బియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. హాస్టళ్లు, పాఠశాలలకు మరమ్మతులతో పాటు అర్థాంతరంగా నిలిచిపోయిన భవనాల నిర్మాణాలు చేపట్టామన్నారు. తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ.15 వేలు చొప్పున్న అందజేస్తున్నామన్నారు. అందులో రూ.2 వేలు పాఠశాలల అభివృద్ధికి వినియోగిస్తున్నామన్నారు. రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకోసం రాష్ట్రంలో భారీ ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని నిర్వహిస్తున్నామన్నారు.

**21 నుంచి 'అన్నదాత సుఖీభవ' అమలు**

ఈ నెల 21న అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయబోతున్నామని, ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించనున్నామని మంత్రి సవిత తెలిపారు. రాజధాని అమరావతి, పోలవరం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా రాయలసీమను పారిశ్రామిక హబ్ గా అభివృద్ధి చేయడానికి సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. అనంతపురం- బెంగళూరు మధ్య భారీ ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయన్నారు. అదే సమయంలో, గత ప్రభుత్వం వేధింపులు తాళలేక రాష్ట్రం నుంచి తరలిపోయిన పరిశ్రమలను వెనక్కి తీసుకొస్తున్నామని, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో ఇప్పటికే చర్చలు జరిపారని తెలిపారు. వాటిలో కొన్ని యాజమాన్యాలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయని మంత్రి సవిత వెల్లడించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల మాదిరిగా పరుగులు తీస్తున్నాయని, త్వరలోనే ఏపీ దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఆవిర్భవించడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తంచేశారు.

**మద్యం కేసుల్లో మా జోక్యం లేదు**

మద్యం కేసులో విషయంలో తమ ప్రభుత్వ జోక్యం లేదని, చట్టం తన పని చేసుకుపోతోందని మంత్రి సవిత స్పష్టం చేశారు. గతంలోనే కల్తీ మద్యం అమ్మకాలపై జగన్‌ను అప్పటి ప్రతిపక్ష, ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు హెచ్చరించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. తమ నాయకుడి సూచనలను జగన్ పట్టించుకోలేదన్నారు. చేసిన తప్పులకు ఇప్పుడు కోర్టులో సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి జగన్ కు వచ్చిందని, ఇందులో ఎవరి ప్రమేయమూ లేదని మంత్రి సవిత తెలిపారు.

**జగన్ కు డైవర్షన్ రాజకీయాలు అలవాటే...**

ఆది నుంచి డైవర్షన్ రాజకీయాలు, శవ రాజకీయాలు చేయడం జగన్ కు అలవాటేనని మంత్రి సవిత తెలిపారు. తల్లికి వందనం పథకం అమలులో ఎటువంటి అవినీతికి ఆస్కారం లేదన్నారు. బాబాయ్ హత్య కేసు, తండ్రి మృతదేహాన్ని అడ్డం పెట్టుకుని సానుభూతి రాజకీయాలు చేయడం అలవాటైన జగన్‌ను ప్రజలు అధికారం నుంచి డైవర్ట్ చేశారని ఎద్దేవా చేశారు. తప్పుడు ఆరోపణలు చేయడం జగన్‌కు అలవాటైందని, తాము ప్రజలకు జవాబుదారీగా ఉంటామని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రధాని పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రి నారాయణ

విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి నారాయణ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ విశాఖపట్నం రానున్నారు. సుమారు 5 లక్షల మంది యోగా దినోత్సవంలో పాల్గొంటారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

లక్షలాదిగా తరలివచ్చే వారికోసం పార్కింగ్ ప్రాంతాలను పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు. వచ్చిన వారందరూ ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి వెళ్లేలా వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు.


వాహనాల రాకపోకలు, పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు మంత్రి నారాయణ దిశా నిర్దేశం చేశారు.



# మందుల కొరత లేకుండా చూడాలి

**రోగుల డిమాండ్ మేరకు సరఫరా - తక్షణమే విధివిధానాలు మార్చాలి - వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ ఆదేశం**

మంగళగిరి (చైతన్యరథం): ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు ఉచి తంగా సరఫరా చేసే మందులకు సంబంధించి ఎటువంటి కొరత లేకుండా చూడాలని వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. మందుల కొనుగోలు, ప్రభుత్వాసుపత్రులకు వాటి సరఫరా విధానం తదితర అంశాలపై మంగళగిరి వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) కార్యాల యంలో మంగళవారం సమీక్షించారు. రాష్ట్రంలో కూటమి ప్రభు త్వం ఏర్పడిన ఆరంభంలో పలు కారణాల వల్ల 150కి పైగా మందుల లభ్యతలో కొరత ఉండేదని, తాజాగా కేవలం తొమ్మిది మందుల విషయంలోనే కొంత కొరత ఉంటుందని అధికారులు మంత్రికి వివరించారు. మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు సంబంధించి రోగులు విడివిడి మందులను కాకుండా ఎక్కువగా కాంబినేషన్ మందులు కోరుతున్నారని వివరించారు. ఆసుపత్రుల డిమాండ్ మేరకు మందులు కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నా మని, అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిల్లో వాటి వినియో గం, నిల్వలకు సంబంధించి సరైన సమాచారం అందించడంలో జాప్యం జరుగుతుందని తెలిపారు. రోగులు ఎక్కువగా వాడే సిట్రి జన్ వంటి మందుల స్థానంలో లివోసిట్రిజన్ వంటి రోగుల అను కూల మందులను డీఎంఈ అధికారులు చేసిన సూచనల మేరకు సరఫరా చేస్తున్నామని వివరించారు. అయితే



వైద్యాధికారులు పాత మందులనే సూచించడంతో కూడా కొంతమేరకు కొరత ఉందన్న భావన ఏర్పడుతోందని తెలిపారు. ప్రభుత్వాసుపత్రుల్లో మొత్తం 712 రకాల మందుల అవసరాన్ని గుర్తించగా.. ఏపీఎంఎస్ఐడీసీ 650 మందులను కొనుగోలు చేస్తుందని చెప్పారు. తక్కువ మోతా దులో అవసరమయ్యే 56 రకాల మందులను ఆసుపత్రుల స్థాయి ల్లోనే సమీకరించుకుంటున్నారని మంత్రికి వివరించారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి త్రైమాసికానికి అవసరమయ్యే మందులను సరైన సమయంలో కొనుగోలు చేసి సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోగుల డిమాండ్ మేరకు మందుల సూచీ పట్టికలో మార్పులు చేసి వారు కోరుకుం టున్న మందులు లభ్యమయ్యేలా విధివిధానాలు మార్చాలని సూ చించారు. వివిధ స్థాయిల్లో మందుల నిల్వల సమాచారం, అవస రాలను నిరంతరం పరిశీలిస్తూ అందుకు అనుగుణంగా మందులు కొనుగోలు చేయాలని ఆదేశించారు. కారణాలు ఏమైనా ప్రజలు నిత్యం వాడే మందుల సరఫరాలో ఎటువంటి కొరత ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల భవనాల నిర్మాణం, వివిధ ఆసుపత్రుల విస్తరణ, అభి వృద్ధి పనులు, పాత..కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల పనుల పురోగతికి సంబంధించిన అంశాలపై కూడా మంత్రి చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపులో ఆలస్యం వల్ల పనుల్లో జాప్యం జరిగిందని, ప్రస్తుతం పరిస్థితి చాలా మెరుగుపడడంతో పనులను పునప్రారంభించ డానికి కాంట్రాక్టర్లు ముందుకొస్తున్నారని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మేనేజింగ్ డైరెక్టర్ గిరీశ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మురళీ నాయక్ కుటుంబానికి అండగా ఉంటాం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- వీరజవాను తల్లిదండ్రులకు పరామర్శ
- ప్రభుత్వం తరపున రూ.50 లక్షల చెక్ అందజేత
- 5 ఎకరాలు, 6 సెంట్ల స్థలం పట్టాలు కూడా..




గోరంట్ల (చైతన్యరథం): దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాను మురళీ నాయక్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా సరిహద్దుల్లో భాగంగా వీర మరణం పొందిన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన మురళీ నాయక్ తల్లితండ్రులను మంత్రి సవిత మంగళవారం పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 50 లక్షల చెక్కును, అయిదెకరాల స్థలాన్ని, ఆరు సెంట్ల ఇళ్ల స్థలం పట్టాలను వారికి మంత్రి సవిత అందజేశారు. భరతమాత ముద్దు బిడ్డ మురళీ నాయక్ అని కొనియాడారు. దేశ ప్రజలందరి గుండెల్లో మురళీ నాయక్ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. దేశ ప్రజలతో పాటు కూటమి ప్రభుత్వం కూడా అండగా ఉంటుందని వీర జవాను తల్లిదండ్రులను ఓదార్చారు. ఏ కష్టం వచ్చినా తనను సంప్రదిస్తే వెన్నుదన్నుగా ఉంటానని భరోసా ఇచ్చారు. అంతకుముందు కళ్లితండాలోని మురళీ నాయక్ ఘాటు వద్దకెళ్లి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. మురళీ నాయక్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. త్వరలోనే మురళీ నాయక్ నివాసం నుంచి ఘాటు వరకూ రూ.16 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు వెల్లడించారు. గోరంట్లతో పాటు జిల్లా కేంద్రంలో కూడా మురళీ నాయక్ కాంస్య విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిశ్రమల స్థాపనకు ముందుకురావాలి

**త్వరితగతిన అనుమతుల మంజూరు - కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ - పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి**

మచిలీపట్నం (చైతన్యరథం): జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్నివిధాలా సహకరిస్తామని, జిల్లాను పారిశ్రా మికంగా అగ్ర పథంలో నిలిపేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్త లు అవకాశాలను అందిపుచ్చుకుని పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పెనమలూరు మండలం తాడిగడప వందదుగుల రోడ్డులోని అన్నే కళ్యాణ మం డపంలో పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని, పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని విధాలా సహకారం అందించి ప్రోత్సహిస్తామని తెలిపారు. పారిశ్రామికవేత్తలకు జిల్లాస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని వస్తే వాటిని పరి ష్కరించి త్వరితగతిన అనుమతులు మంజూరుకు కృషి చేస్తామని వివరించారు. రాష్ట్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు అన్నివిధాలా కృషి చేస్తామని తెలిపారు. రుణాల రీ షెడ్యూల్‌కు ఎవరికైనా అవ సరం అయితే జిల్లా యంత్రాంగం తరపున అన్నివిధాలా సాయం చేస్తామని చెప్పారు. అవసరమైతే ఆటోనగర్‌లో వ్యాపారవేత్తలు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి పారిశ్రా మిక సమ్మేళనం లేదా సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్.వెంకట్రావు, ఉయ్యూరు ఆర్డీవో బి.ఎస్.హేళ షారూన్, ఎల్‌డీఎం సి.రవీంద్రారెడ్డి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఆశారాణి, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్య క్షుడు పి.భాస్కరరావు, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ చైర్ పర్సన్ వి.నాగలక్ష్మి, అధినేత శ్రీనివాస సతీష్, ఏపీఎంఎస్ఎంఈ సంఘం అధ్యక్షులు బయాన వెంకటరావు, వీఏసీడీసీఎల్ సీఎండీ అన్నే శివనాగేశ్వరరావు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## ఖబడ్దార్ జోగి రమేష్



- ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడు.
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ ఫైర్

అమరావతి (చైతన్యరథం): వైసీపీ నాయకుడు జోగి రమేష్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ హెచ్చరించారు. చంద్రబాబు ఇంటి మీదకు వస్తానంటూ బలుపుతో మాట్లాడుతున్నావా.. నీకు దమ్ము ధైర్యం ఉంటే రా చూస్తాం అని రమేష్ ఫైర్ అయ్యారు. అమరావతిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జోగి రమేష్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. అమరావతి రాజధాని పై కొందరు వైసీపీ సైకోలు విషం కక్కుతున్నారని ఆయన విమర్శించారు. తల్లికి వందనం పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటిలో పండుగ వాతావరణం కనిపిస్తోందన్నారు. తల్లికి వందనం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. తల్లికి వందనం పథకాన్ని దిగ్విజయంగా అమలు చేశామని, చంద్రబాబు ఏడాది పాలన సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాలుగా పరుగులు తీస్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబును, మంత్రి లోకేష్ లను వైసీపీ సైకోలు విమర్శించడానికి ఆయన తీవ్రంగా ఖండించారు. వైసీపీ నేత వాసుపల్లి గణేష్ పిచ్చివాగుడు వాగుతున్నారని, చంద్రబాబు, లోకేష్‌లను విమర్శిస్తే చూస్తూ ఊరు కోమన్నారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ రాష్ట్రంలో విద్యారంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని పాతర్ల రమేష్ అన్నారు.

## పరిశుభ్రత, ఆహార నాణ్యతకు ప్రాధాన్యత

**- తిరుమల బాలాజీ రెస్టారెంట్ నిర్వాహకులకు ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని స్పష్టీకరణ**




తిరుమల (చైతన్యరథం): తిరుమల బాలాజీ రెస్టారెంట్‌లో పరిశుభ్రతకు, ఆహార నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్వాహకులకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) చైర్మన్ డా.నూకసాని బాలాజీ స్పష్టం చేశారు. తిరుమలలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉన్న బాలాజీ రెస్టారెంట్‌ను ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ మంగళవారం పరిశీలించారు. రెస్టారెంట్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం గమనించి, వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తులు, పర్యాటకులకు శుభ్రమైన వాతావరణం కల్పించడం శాఖ ప్రథమ కర్తవ్యమన్నారు. రెస్టారెంట్‌ను వచ్చే నెలాఖరులోపు పూర్తిగా పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచిస్తూ, తిరుమలకు దీనిని ప్రత్యేక ఆకర్షణగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రెస్టారెంట్ శాశ్వత నిర్వహణ, ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు పాటించటం, వినియోగదారులకు మెరుగైన సేవల కల్పన, స్థానిక వంటకాలకు, సాంప్రదాయ వంటకాలకు ప్రోత్సాహం కల్పించడం, దక్షిణ భారతీయ వంటకాలతో పాటు ఉత్తర భారతీయ వంటకాలను కూడా మెనూలో చేర్చడం, తదితర అంశాలపై ఆయన చర్చించారు. దేశ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత నాణ్యమైనదిగా భావిస్తూ ప్రచారం కల్పిస్తున్న మన ఆంధ్ర అరకు కాఫీని వెంటనే ఇక్కడి రెస్టారెంట్లలో అందుబాటు లోకి తేవాలని సూచించారు. అరకు కాఫీ విశిష్టతను పర్యాటకులకు వివరించేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పర్యాటక అభివృద్ధికి మౌలిక వసతుల నాణ్యత, పరిశుభ్రత కీలకమైన అంశాలని ఆయన స్పష్టం చేశారు. తిరుమల పర్యటన భక్తులకు ఒక మంచి అనుభవంగా మిగలాలని పేర్కొన్నారు. రెండు వారాల్లో తిరిగి ఆకస్మిక తనిఖీ చేసి అభివృద్ధి స్థాయిని సమీక్షిస్తానని, శుభ్రత, నాణ్యత ప్రమాణాల్లో నిర్లక్ష్యం ఉంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో చైర్మన్ వెంట పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు, స్థానిక సిబ్బంది, బాలాజీ రెస్టారెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# మహిళా రక్షణ, సాధికారతే లక్ష్యం

- వేధింపులు, దాడులకు పాల్పడితే శిక్ష తప్పదు
- 24 గంటలూ కమిషన్ అందుబాటులో ఉంటుంది
- 10 మంది దాటిన సంస్థల్లో ఫిర్యాదుల కమిటీలు
- బాలికల రక్షణ కోసం నిరంతరం చర్యలు తీసుకుంటాం
- జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మజుందార్



విజయవాడ(చైతన్యరథం): బాలికలు, మహిళల రక్షణ, హక్కు ల పరిరక్షణకు మహిళా కమిషన్ కృషి చేస్తుందని జాతీయ మహి ళా కమిషన్ సభ్యురాలు అర్చన మజుందార్ తెలిపారు. దేశంలో ఎక్కడ మహిళకు అన్యాయం జరిగినా చర్యలు తప్పవని హెచ్చరిం చారు. జాతీయ మహిళా కమిషన్ మూడురోజుల రాష్ట్ర పర్యటన లో భాగంగా మొదటిరోజు మంగళవారం విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, పాత ప్రభుత్వ వైద్యశాలను జాతీయ ఆమె సందర్శించారు. మహిళలను లైంగికంగా వేధింపులకు గురి చేసినా, దాడులు చేసినా మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. 10 మంది కంటే ఎక్కువ మంది సిబ్బంది పని చేస్తున్న ఏ వ్యాపార సంస్థలైనా, విద్యాసంస్థలైనా, కార్యాలయాలైనా ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆ కమి టీని సీనియర్ మహిళా ఉద్యోగిని ఆధ్వర్యంలో నిర్వహించేలా చర్య లు తీసుకోవాలని సూచించారు. మహిళల రక్షణ కోసం 24 గంట లు మహిళా కమిషన్ అందుబాటులో ఉంటుందని, బాధితులు ఏ సమయమైనా తమకు ఫిర్యాదు చేసినా తక్షణం చర్యలు తీసుకుం టామని తెలిపారు. సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో వారం రోజుల్లో ఐసీసీ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే కళాశా లలో మహిళా రక్షణ చర్యలపై డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయా లని, హెల్ప్‌లైన్ నెంబర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు, కళాశాల ఉద్యోగులు, ఫ్యాకల్టీల సమస్యలను మొదట ఐసీసీ కమిటీలో పరిష్కరమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఫిర్యాదులను దృష్టికి తీసుకురావాలి**

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ మాట్లా డుతూ ఆయా సంస్థల్లో ఏర్పాటు చేసిన ఐసీసీ ద్వారా బాధిత మహి ళకు న్యాయం జరగపోతే రాష్ట్ర, జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి మహిళా ప్రశాంత వాతావరణంలో పనిచేసేలా మహిళా కమిషన్ చర్యలు తీసుకుంటుందని వివరిం చారు. వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులతో పాటు ఏ రకం గా అయినా మహిళలను వేధిస్తే చర్యలు తప్పవని హెచ్చరించా రు. మహిళల రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ. ఏడుకొండలరావు, ఐసీడీఎస్ అధికారులు, కళాశాల అధ్యాపకు లు, సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లికి వందనం పథకం ఎంతమంది ఉన్నా ఇస్తున్నాం

**●పరామర్శలు పేరుతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు**

**●రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హెచ్చరిక**



ఇచ్ఛాపురం (చైతన్యరథం): రాష్ట్రంలో తల్లికి వందనం పథకం అమలు చేయలేదని ప్రజలకు తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికి అందిస్తున్నామని, గత ప్రభుత్వం అమ్మఒడి పథకం పేరుతో ఒక్కరికి మాత్రమే ఇచ్చి ప్రజలను మోసం చేసిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో యోగాంధ్రా కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం అమలు చేశామని, ఎక్కడా మార్పు చేయలేదని, సిగ్గు ఎగ్గు లేకుండా కనీస పరిజ్ఞానం లేకుండా వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. బెంగుళూరు నుంచి ఒకసారి రాష్ట్రానికి వచ్చి షికారులు చేసుకుని వెలుతున్నారో అర్థం కావడంలేదని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఫించన్ల పెంపు, మహిళలకు ఉచిత గ్యాస్, ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తికి చర్యలు తీసుకున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 34 వేల కోట్లు ఫించన్లు అందిస్తున్నాం. పాఠశాల నిర్వాహణ కోసం రూ.2వేలు ఇస్తుంటే దుర్మార్గంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రూ.రెండు వేలు లోకోష్‌బాబు ఖాతాలోకి వెళ్లాయని నీచంగా మాట్లాడుతున్నారని అన్నారు. ప్రభుద్దులారా... ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తున్న ప్రభుద్దులారా 24 గంటల్లో రెండువేల రూపాయిలు లోకేష్‌బాబు ఖాతాలో పడిందని మాట్లాడారో దానిని నిరూపించాలని ఛాలెంజ్ విసిరారు. లోకేష్‌బాబు ఛాలెంజ్‌కు ఒక్కరు కూడా స్పందించలేదని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వ్యక్తులమని, గడిచిన ఐదేళ్లలో ప్రజలకు స్వేచ్ఛలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తరువాత ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందని అన్నారు. 2019-2024 మధ్యలో ప్రజలకు బయటకు వచ్చి మాట్లాడే పరిస్థితి లేదని, ప్రజా సమస్యలపై అధికారులకు వినతి పత్రం ఇచ్చేందుకు వస్తే ఉదయం 4 గంటలకే పోలీసులు ఇంటి వద్దకు వచ్చి బయటకు రాకుండా చేసి అరెస్టులు చేశారని అన్నారు. పరామర్శల పేరుతో రౌడీలు గూండాలతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి వాటిని ఉపేక్షించమని అన్నారు. పరామర్శలు పేరుతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తప్పుడు సమాచాం ఇచ్చినా తప్పుడు ప్రకటనలు చేసిన తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. అన్ని వర్గాల ప్రజలపై దాడులు చేశారు. ఎవ్వరినీ వదలలేదు.. దళితులను ఊచకోత కోశారని విమర్శించారు. చిత్తూరులో మహిళలపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పనికిమాలిక పత్రిక, టీవీ చానల్ అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, తారీఖు, రోజు, కోడిమాంసం ధర ఈ మూడు అంశాలు మాత్రమే నిజాలు రాస్తున్నారని, మిగిలిన రాతలు అసత్యాలు రాస్తున్నారని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్ఛాపురంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

**● తీవ్రంగా గాయపడిన ఏడుగురు... ఒకరి పరిస్థితి విషమం**

ఏపీలోని శ్రీకాకుళలం జిల్లాలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు తీవ్రంగా దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో మొత్తం ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అయితే వీరిలో ఒకరి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం బరంపురం ఆసుపత్రి తరలించారు. ఈ గొడవకు పాత కక్షలే కారణమని తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో పర్యటించి గొడవు కారణాలు ఎంటో విచారణ చేపట్టారు. గ్రామంలో పరిస్థితులు ప్రస్తుతం అదుపులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# యోగాసనాలు వేసిన ఎమ్మెల్యే చదలవాడ

**● యోగాను దినచర్యగా మార్చుకోవాలని పిలుపు**

**● విశాఖలో ఈ నెల 21న జరగబోయే యోగా దినోత్సవంలో పాల్గొనండి**



నరసరావుపేట (చైతన్యరథం): నియోజకవర్గం శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు పార్టీ కార్యాలయం నందు పార్టీ నాయకులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ మాట్లాడుతూ... యోగాను దినచర్యగా మార్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21 వ తేదీన విశాఖపట్నంలో ఘనంగా నిర్వహించనున్నారని ఈ కార్యక్రమనికి భరతదేశ ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పాల్గొంటారని, అందరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నమ్మి కుటుంబసభ్యులతో పాటు చాలా మందిని నాశనం చేసిన ఘనుడు జగన్‌రెడ్డి : కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి (చైతన్యరథం): జగన్‌ను నమ్మి కుటుంబసభ్యులతో పాటు చాలా మంది నాశనమయ్యారని మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మండిపడ్డారు. సత్తెనపల్లి మున్సిపాలిటీలో వైసీపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు కన్నా సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పల్నాడు జిల్లా రెంటపాల్లలో ఆత్మహత్య చేసుకున్న వైసీపీనేత నాగమల్లేశ్వరరావు విగ్రహావిష్కరణకు జగన్ వస్తుండటంపై స్పందించారు. "జగన్ ఇచ్చిన తప్పుడు సర్వే రిపోర్టులతో ఎన్నికల బెట్టింగ్లో నాగమల్లేశ్వరరావు రూ.10 కోట్లు పోగొట్టుకున్నారు. అప్పులవారి నుంచి అవమానాలు భరించలేక ఆయన 2024 జూన్9న ఆత్మహత్య చేసుకున్నారు. ఇప్పుడు ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడానికి జగన్ రావడం సిగ్గుచేటు. జగన్ అరాచకాలను భరించలేకే 2024లో ఆయన పార్టీని ప్రజలు చిత్తుగా ఓడించారు. అరాచక శక్తుల్ని పరామర్శించేందుకు వస్తే ఈ సారి 11 సీట్లు కూడా రావు" అని కన్నా వ్యాఖ్యానించారు. జగన్ పల్నాడు జిల్లా పర్యటనకు ఒక్క రోజు ముందు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరడం విశేషం.

# ఆరోపణలు చేసి పారిపోవడం కాదు జగన్‌రెడ్డి

**● నారా లోకేష్‌పై చేసిన ఆరోపణలు నిరూపించలేకపోతే వైసీపీని మూసివేయాల్సిందే : ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): ఎన్డీయే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనంను అమలు చేస్తే అది చూసి తట్టుకోలేని జగన్‌రెడ్డి అండ్ కో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై విషం చిమ్ముతుందని, దీనిని తాము ఏ మాత్రం సహించమని, చేసిన అసత్య ఆరోపణలు నిరాధారమని ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, నిరూపించపోతే వైసీపీ పార్టీ మూసివేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి డిమాండ్ చేశారు. మంగళవారం గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు తల్లికి వందనం ఇచ్చిన హామీ ప్రకారం ఎంతమంది ఉంటె అంతమందికి "తల్లికి వందనం" డబ్బులు జమచేశాము. సంక్షేమం జరుగుతుంటే వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తూ నారా లోకేష్ మీద విషమ చిమ్ముతుంది. వైసీపీ పాలనలో రూ.13 వేలు ఇచ్చారు. అంటే రూ.2 వేలు జగన్ జేబుల్లోకి పోయాయా? తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా? అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రశ్నించారు. వైసీపీ చేసిన విమర్శలను చూసి ప్రజలు వైసీపీ అసహ్యించుకుంటున్నారు. వైసీపీలా అబద్దపు హామీలతో గెలిచి, మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం కాదు, ప్రజా మద్దతుతో గెలిచిన ప్రభుత్వమన్న విషయం జగన్‌రెడ్డి గుర్తించుకోవాలన్నారు. తమ మనుగడ కోసం నిరాధార ఆరోపణలు చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తుందని, కుటుంబంలో ఒక్కరికే అనే షరతు పెట్టి పేద, మధ్య తరగతి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను జగన్మోహన్‌రెడ్డి మానసికంగా వేధింపులకు గురి చేసారని 2019 ఎన్నికల ప్రచారంలో "మీ ఇంట్లో ఇద్దరు పిల్లల్ని బడికి పంపండి ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున ఇస్తాం" అంటూ మీ సతీమణి, సాక్షి పత్రిక యజమాని, భారతి రెడ్డి ప్రచారం చేయలేదా? అని ఎమ్మెల్యే విమర్శించారు. జగన్ హయాంలో ప్రతియేటా వివిధ కారణాలతో లబ్ధిదారులను తగ్గించుకుంటూ పోయారని 2021లో 44.48 లక్షల మంది లబ్ధిదారులు ఉంటే 2023కి ఆ సంఖ్య 42.61 లక్షలకు పడిపోయిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది లబ్ధిదారులకు తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# దమ్మున్న నేత చంద్రబాబునాయుడు

**● తల్లికి వందనం పథకం గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**



గుడివాడ (చైతన్యరథం): దమ్మున్న నేత చంద్రబాబునాయుడుని వైసీపీ నేతలు సంక్షేమ పథకాలు అమలు చేయలేదని విమర్శిస్తున్న తల్లికి వందనం ప్రతి బిడ్డకు అమలు చేసి సత్తాచాటిన నేత చంద్రబాబునాయుడు అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక ప్రజా వేదికలో మంగళవారం రాత్రి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ... రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ఊరికి పోయేలా చేసిన జగన్ పేద విద్యార్థుల భవిత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి బిడ్డకు నగదు ఇస్తే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. అమ్మఒడి పేరుతో కేవలం ఇంట్లో ఒక్క బిడ్డకు మాత్రమే నగదు ఇచ్చిన జగన్... చంద్రన్న ప్రతి బిడ్డకు ఇవ్వడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన ప్రతి పథకాన్ని అమలు చేస్తారని వెనుదిరిగే ప్రసక్తే లేదన్నారు పెన్షన్ ఇప్పటికే పెంచారని త్వరలో రైతు భరోసా, స్త్రీలకు ఆగస్టు 15 కు ఉచిత బస్సు, ఇస్తారని తెలిపారు. జగన్ బటన్ నొక్కితే కొందరికి మాత్రమే లబ్ధి చేకూరేదని కానీ చంద్రబాబు బటన్ నొక్కితే ప్రతి బిడ్డకు తల్లికి వందనం పడుతుందని స్పష్టం చేశారు. నియోజకవర్గం పరిశీలకురాలు. ఎలగాల నూకానమ్మ యాదవ్ మాట్లాడుతూ దూర దృష్టి గల నేత అని పేదల బిడ్డలందరూ చదువుకోవాలని ఓ ఇంట్లో 12 మంది బిడ్డలు ఉన్న వారందరికీ తల్లికి వందన వేసిన ఘనుడు అన్నారు చంద్రబాబు అభివృద్ధి సంక్షేమం ఉపాధిలకు ప్రాధాన్యస్తూ రాష్ట్ర భవిష్యత్తు కోసం శ్రమిస్తున్నారు. గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ తల్లికి వందనం అందరికీ రావడంతో వైకాపా నేతల భవితకు తూట్లు పడ్డాయి అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దిండ్యాల రాంబాబు రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు వాసే, మురళి, నందివాడ మండలం అధ్యక్షులు సన్యాసిరావు, తెదేపా నాయకులు లింగం ప్రసాద్, జనసేన నాయకుడు సందు పవన్ పాల్గొన్నారు.

# టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఇండియాకు ఐదు దేశాల మద్దతు : ఎంపీ గంటి హరీష్ మాధుర్



అమలాపురం (చైతన్యరథం): ఆపరేషన్ సిందూర్‌ని ప్రారంభించి టెర్రరిజం అణచివేతకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ నేతృత్వంలో గయానా, పనామా, కొలంబియా, బ్రెజిల్, యునైటెడ్ దేశాలను సందర్శించారు. ఈ బృందంలో ఎంపీ హరీష్ బాలయోగి కూడా ఉన్నారు. ఢిల్లీకి తిరిగి వచ్చిన తర్వాత మీడియాతో ఆయన మాట్లాడారు. ఐదు దేశాలతో దౌత్యపరమైన చర్చలు జరిపినట్లు వెల్లడించారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాలు ఇండియాకు మద్దతిచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా ఆ దేశాల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. మే 24వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు వివిధ దేశాల్లో తాము పర్యటించామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ వెల్లడించారు. యునైటెడ్ నేషన్స్ పర్యటన అనంతరం ఇండియాకు చేరుకున్నామని తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడదామని ఆయా దేశాలకు తాము వివరించామని అన్నారు.

పాకిస్థాన్ మిలటరీ బేస్ క్యాంప్‌నకు ఇబ్బంది లేకుండా టెర్రరిస్టులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని భారత బలగాలు దాడులు చేశాయని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నేతలతో కలిసి ఈ పర్యటన చేశామని చెప్పారు. న్యూయార్క్ 9/11 టెర్రరిస్ట్ దాడులను జ్ఞాపకం చేసుకుని, టెర్రరిజాన్ని అంతం చేయాలనే విషయాన్ని ఆయా దేశాల ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశామని అన్నారు. తాము పర్యటించిన ప్రతి దేశంలో భారతదేశానికి మద్దతు లభించిందని గుర్తుచేశారు.

టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాల ప్రతినిధులకు భారతదేశం అండగా ఉంటుందని చెప్పామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. యుద్ధం పరిష్కారం కాదు కానీ టెర్రరిజం అంతం చేసే ప్రణాళికలకు అందరూ సహకరిస్తున్నారని అన్నారు. భార్య బిడ్డల ముందు పహల్గామ్‌లో భారత పర్యాటకులను పాకిస్థాన్ ఉగ్రవాదులు చంపడం నీచమైన చర్య అని... దీనినే ప్రపంచ దేశాలకు తెలియజేశామని చెప్పారు. ఇండియాతో కలసి రావటానికి ప్రపంచ దేశాలు మొగ్గు చూపాయని ఎంపీ గంటి హరీష్ మాధుర్ పేర్కొన్నారు. పాకిస్థాన్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు.

పాకిస్థాన్ చేస్తున్న కుట్రలను ప్రపంచ దేశాలకు తెలియజేశామని... వాస్తవాలను అందరూ గ్రహించారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో సామాన్యులకు, పౌరులకు ఎలాంటి హాని జరగలేదని గుర్తుచేశారు. పక్క ప్రణాళికతో ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశం తనకు కల్పించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి కృతజ్ఞతలు తెలిపారు.

# నారా లోకేష్ నాయకత్వంలో విద్యారంగం విశ్వవ్యాప్తం : టీడీపీ అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు



చింతలపూడి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నారా లోకేష్ నాయకత్వంలో విద్యా రంగం విశ్వవ్యాప్తి చెందుతూ అద్భుత ప్రతిభ సాధిస్తుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు అన్నారు. చింతలపూడి నియోజకవర్గం జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలోని మోడల్ పాఠశాలలో విద్యామిత్ర కిట్లను స్థానిక ఉపాధ్యాయులు, గ్రామ నాయకులతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత విద్యారంగంలో అద్భుత మార్పును సాధించారని, ఆయన విదేశాల్లో చదువుకున్న జ్ఞానం నేడు ఇక్కడి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని అన్నారు. తల్లికి వందనం ద్వారా ప్రతి తల్లి ఖాతాలో నగదు జమ చేయడం తోపాటు పాఠశాల ప్రారంభం రోజునే నాణ్యమైన ప్రపంచ స్థాయి పుస్తకాల అందజేత, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్, బూట్లు, బెల్టులు, వీటితో పాటు ఒక క్లాస్, ఒక టీచర్, ప్రతిభ పురస్కారాలు, ఫీ రీఎంబర్స్మెంట్ బకాయిలు విడుదల, మోడల్ స్కూల్స్, ఇలా ప్రతిదీ కూడా చాలా పారదర్శకంగా, ఉన్నతమైన ప్రమాణాలు పాటిస్తూ ముందుకు తీసుకెళ్తున్నారు అని లోకేష్ సేవలను శేషు కొనియాడారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీ, క్వాటం వ్యాలీ వంటి నూతన టెక్నాలజీలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళుతున్నారని అన్నారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్వాలిటీ మరియు అత్యుత్తమ విద్యను అందింస్తూ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం పనిచేస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం గ్రామ సర్పంచ్ ఎడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పొల్నాటి శ్రీను, ఎస్సెఎంసి చైర్మన్ తమ్మిర్చి నిర్మల, తడికల దావీదు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం తగదు : జ్యోతుల నవీన్ కుమార్

**●తల్లికి వందనం పథకం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు మేలు**




కాకినాడ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో మొదటి దశలోనే తల్లికి వందనం పథకం కింద 67.27 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చిందన్నారు. గత పాలనలో ఈ పథకం కేవలం 42 లక్షల మందికి మాత్రమే పరిమితమైందని, ఇప్పుడున్న ప్రభుత్వ హస్తక్షేపంతో ప్రతి విద్యార్థికి మేలు జరుగుతున్నదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రతిపక్ష వైసీపీ నాయకులు బాధ్యతారహితంగా దుష్ప్రచారం చేస్తూ ప్రజల అవగాహనను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ప్రజలు ఇప్పటికే వారి అసత్య ప్రచారాన్ని తిరస్కరిస్తున్నారు," అన్నారు. జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం అనే భావనలు లేకుండా, విధ్వంసం, అక్రమాలు, అన్యాయాలే కొనసాగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడాదిలోపే రోడ్ల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలుతో అభివృద్ధి కార్యక్రమాలను బలోపేతం చేశారని తెలిపారు. అమరావతి విధ్వంసం, ప్రజా వేదిక కూల్చివేత వంటి చర్యలు అప్పటి ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేకతను తెచ్చిపెట్టినాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలను వరుసగా ప్రవేశపెడుతున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రభాగంగా నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మరియు ఇతర కేంద్ర, రాష్ట్ర మంత్రులు సమన్వయంగా కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పెంకే శ్రీనివాస బాబా, చప్పిడి వెంకటేశ్వరరావు, ఉంగరాల బూరిబాబు పాల్గొన్నారు.

# ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించని వైసీపీ ప్రభుత్వం

**●రాజమహేంద్రవరం 10వ డివిజన్‌లో రూ.77 లక్షలతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించని ప్రభుత్వం ఉంటే ఏంటి పోతే ఏంటని అనుకున్న ప్రజలు వైసీపీని సాగనంపారని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. 10వ డివిజన్ ఎన్.హెచ్-16 నుంచి శ్రీనగర్ కాలనీలోని ఎ.పి.ఎస్.ఇ.బి. విద్యుత్ కల్యాణ మండపం వరకు రూ.67 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల పనులకు మంగళవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జగన్ పాలనలో వైసీపీ నాయకులు రాజమండ్రిలో నాలుగైదు రోడ్లు వేసి అదే అభివృద్ధి అని చెప్పారని, నాలుగేళ్ళుగా వందల కోట్లు ఖర్చుపెట్టామని గొప్పలు చెప్పుకున్నారని, మరి ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. ఈ ప్రాంత ప్రజలు నాలుగేళ్ళుగా ఇంటీరియర్ రోడ్లు లేక ఇబ్బందులుపడుతున్నారని, ఇంతకాలానికి వారికి ఈ రోడ్డు వేస్తున్నామని ఆయన అన్నారు. అలాగే విద్యుత్ కల్యాణ మండపం నుంచి రైతు బజారు వరకు మరో రూ.10 లక్షలతో కొనసాగింపుగా రోడ్డు, షాపుల వద్ద కాలువ నిర్మాణం చేపడుతున్నామని, దీంతో మొత్తం రూ.77 లక్షలతో పనులు చేయిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వివరించారు. కూటమి అధికారంలోకి రాగానే ప్రజలు వచ్చి బాబూ తమ ప్రాంతంలో అంతర్గత రోడ్లులేవని, కనెక్టివిటీ రోడ్లు వేయలేదని చెబుతున్నారని, వారి కోరిక మేరకు కనీస మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఏ ప్రభుత్వం అయినా ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించాలని ఆయన అన్నారు. తమ కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బలమైన నాయకులని, ఎక్కడికక్కడ చాలా బాగా పని చేస్తున్నారని, ఎక్కడ ఎవరికి ఏ అవసరం ఉందో తెలుసుకుని ఆ పనులు చేసేలా చూస్తున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అభినందించారు.

# తల్లికి వందనంపై దుష్ప్రచారం ఆపాలి

**● వైసీపీ నాయకులను హెచ్చరించిన వరుపుల సత్యప్రభరాజా**



ప్రత్తిపాడు (చైతన్యరథం): తల్లికి వందనం పథకం అమలు విజయవంతం కావడంతో నియోజకవర్గంలోని రౌతులపూడి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి థాంక్యూ సీఎం సార్ పేరిట నియోజకవర్గ ఎమ్మెల్యే వరపుల సత్యప్రభరాజా కృతజ్ఞతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని లబ్ధిదారులు అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా తల్లికి వందనం పేరిట 67.27 లక్షల మందికి 13 వేల రూపాయల చొప్పున వారి అకౌంట్లో వేయడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారో అంతమందికి తల్లికివందనం ఇవ్వడం జరిగిందని, పాఠశాలల అభివృద్ధి కోసం కేటాయించిన రూ.2 వేలు లోకేష్ జేబులోకి వెళ్ళాయంటూ వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. ఈ విషయంలో ఇప్పటికే నారా లోకేష్ ఛాలెంజ్ చేస్తే వైసీపీ నాయకుల నుంచి కనీసం స్పందన లేదని, తప్పుడు ప్రచారాలు మానుకోవాలని లేకుంటే న్యాయపరమైన చర్యలు ఎదుర్కొవాల్సి ఉంటుందన్నారు.

# అమ్మఒడికి జగన్ రెండేళ్లు పంగనామం పెట్టాడు

**● మండిపడ్డ టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి**

రాజమహేంద్రవరం (చైతన్యరథం): కూటమి ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. వేమగిరిలోని ఉన్నత పాఠశాల ఆవరణలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఒక బిడ్డకు మాత్రమే 'అమ్మఒడి' వేసిందని, మూడేళ్లు వేసి రెండేళ్లు పంగనామం పెట్టిందని ఆరోపించారు. తల్లికి వందనం పథకాన్ని ఇంట్లో ఎంతమంది చదుకునే పిల్లలు ఉన్నా సరే ప్రతి ఒక్కరికీ రూ.13 వేలు చొప్పున తల్లుల బ్యాంకు ఖాతాకు కూటమి జమ చేసిందన్నారు. మిగిలిన రూ.2 వేలు పాఠశాల అభివృద్ధికి ఉప యోగిస్తుందన్నారు. మండలంలో ఒకరు-3199, ఇద్దరు-2843, ముగ్గురు-228, నలుగురు-13 వెరసి 9,621 మంది విద్యార్థుల సొమ్మును తల్లుల ఖాతాకు జమ చేసిన ట్టు వివరించారు. సన్నబియ్యం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. తల్లికి వందనం పథకం అమలుపై లబ్ధదారులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.

# తల్లికి వందనం పథకం పట్ల అసూయ, ద్వేషంతో రగిలిపోతున్న జగన్ : భాష్యం ప్రవీణ్

- వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు



పెదకూరపాడు (చైతన్యరథం): తల్లికి వందనంపై విషం చిమ్మడం విద్యార్థుల జీవితాలను హరించడమేనని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకంతో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తమ ఖాతాల్లో నగదు పడడంతో ప్రతి తల్లి సంతోషంగా ఉందని అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మీడియాతో మాట్లాడుతూ... తల్లికి వందనంపై బులుగు పార్టీ విషం చిమ్మడం సిగ్గుచేటున్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15,000 ఇస్తుంటే ఇచ్చిన మాట తప్పి ఒక్కరికి మాత్రమే అమ్మఒడి ఇచ్చిన వైసీపీ దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయడం చేతకాని వైసీపీ నేతలు లోకేష్ జేబులోకి 2 వేల రూపాయలు పోయాయని దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్, ఆధారం లేని ఆరోపణలు చేస్తూ తల్లికి వందనం గురించి మాట్లాడటం సరికాదన్నారు. వైసీపీ పాలనలో 42 లక్షల మంది పిల్లకు ఇస్తే కూటమి ప్రభుత్వం 67 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని అందిస్తూ 8,700 కోట్ల రూపాయలను విడుదల చేసిందన్నారు. చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని, ప్రతి తల్లి ఆనందం వ్యక్తం చేస్తుంటే జగన్‌కు కడుపు మంటగా ఉందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. కేజీ నుండి పీజీ వరకు చదివిస్తానని బడుగు బలహీన, మైనార్టీ లైన 12 లక్షల మంది విద్యార్థులను జగన్ మోసం చేశారన్నారు. ఇచ్చిన హామీని అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ చేస్తున్న కృషికి ఇప్పుడు విద్యార్థుల తల్లులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అభివృద్ధితో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ పాలన కొనసాగిస్తుందన్నారు. ఎన్టీఆర్ భరోసా కింద 34 వేల కోట్ల రూపాయలను కూటమి ప్రభుత్వం కేటాయిస్తే వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.21వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. అన్నదాత సుఖీభవ కింద కూటమి ప్రభుత్వం 14 వేల కోట్ల రూపాయలను కేటాయిస్తే వైసీపీ ప్రభుత్వం రూ.7000 కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించిందన్నారు. కూటమి ప్రభుత్వం దీపం పథకానికి 2,650 కోట్లు, మత్స్యకారుల సేవలో 259 కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. వైసీపీ నాయకులు తల్లికి వందనం పథకంపై చేస్తున్న తప్పుడు ప్రచారాని ఆపాలని లేకుంటే తగిన బుద్ధి చెబుతామని భాష్యం ప్రవీణ్ హెచ్చరించారు.

# పబ్బం గడుపుకునేందుకే పరామర్శ యాత్రలు

- వైసీపీ నాయకుడు నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు జగనే కారణం
- నాగమల్లేశ్వరరావు చావును కూడా రెడ్ బుక్ ఖాతాలో వేసేందుకు కుట్ర
- మండిపడ్డ ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ



గుంటూరు (చైతన్యరథం): రాజకీయ పబ్బం గడుపుకునేందుకే వైసీపీ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి పరామర్శ పేరుతో యాత్రలు చేస్తూ నిత్యం రాష్ట్రంలో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నాడని, ప్రభుత్వ వేధింపులతోనే వైసీపీ నాయకుడు నాగమల్లేశ్వరరావు చనిపోయారని అసత్య ప్రచారం చేయడం దారుణమని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. జగన్ ఇచ్చిన తప్పుడు సర్వే రిపోర్టులతో 2024 ఎన్నికల బెట్టింగ్‌లో వైసీపీ నాయకుడు నాగమల్లేశ్వరరావు రూ.10 కోట్ల పోగొట్టుకున్నారని, అప్పుల వారి నుంచి అవమానాలు భరించలేక ఆయన 2024 జూన్ 9న ఆత్మహత్య చేసుకున్నారని... కూటమి ప్రభుత్వం ఏర్పడకముందే వేధింపులంటూ వైసీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని, నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు జగనే ముమ్మాటికి కారణమన్నారు. నాగమల్లేశ్వరరావు అతి నమ్మకానికి అసలు కారణం జగనేనని, వైనాట్ 175 అనే ఎన్నికల ప్రచారం చేసి పార్టీ నాయకులను, కార్యకర్తలను నమ్మించారని అన్నారు. ఎన్నికల పోలింగ్ తరువాత, ఫలితాల ముందు మెజారిటీ సర్వే సంస్థలు వైసీపీ ఓడిపోతోంది అని చెబుతున్నా... "వైనాట్ 175, మనం క్లీన్ స్వీప్ చేస్తున్నాం" అని ముందురోజు కూడా జగన్ పెద్దఎత్తున ప్రచారం చేయించి పార్టీ వర్గాలను, అభిమానులను నమ్మించాడని, కారణంగా పలువురు వైసీపీ కార్యకర్తలు, నాయకులు గుడ్డిగా జగన్‌ను నమ్మి కోట్లలో పందెలు కాసి నష్టపోయారని అన్నారు. జగన్‌ను నమ్మి కుటుంబసభ్యులతో పాటు చాలా మంది నాశనమయ్యారని, గొడ్డలిపోట్ల హత్యలు, గులకరాళ్ల దాడులు ఇలా ఇతరుల ఖాతాలో వేసే కథలు చెప్పడంలో జగన్ సిద్ధహస్తుడు అన్నారు. చావుల కోసం ఎదురుచూస్తూ... రాష్ట్రానికి వచ్చి శవ రాజకీయాలు చేసే జగన్... తన అతి ప్రచారం వలన భూములను పందెం కాసి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకొన్నాడనే పశ్చాత్తాపం కూడా లేకుండా నాగమల్లేశ్వరరావు చావును కూడా రెడ్ బుక్ ఖాతాలో వేసి రాజకీయ కుట్రకు తెరతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది క్రితం వైసీపీ నాయకుడు నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడితే ఇప్పుడు విగ్రహా ఆవిష్కరణ పేరుతో ఈనెల 18న పల్నాడు జిల్లా రెంటపాల్లలో పరామర్శ పేరుతో యాత్ర చేయడం శోచనీయమన్నారు.

# ప్రాధాన్యత క్రమంలో ఎన్నికల హామీల అమలు : యార్లగడ్డ

- తల్లికి వందనంపై విష ప్రచారం దారుణం



గన్నవరం (చైతన్యరథం): ఎన్నికల హామీలను ప్రాధాన్యత క్రమంలో తమ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. స్కూళ్లు తెరిచే నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు స్కూలు బ్యాగులు అందజేయడంతో పాటు తల్లికి వందనం పథకం అమలు చేసి తల్లుల ఖాతాలో నిధులు జమ చేస్తున్నట్లు యార్లగడ్డ వివరించారు. ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటున్నప్పటికీ వారందరికీ ఈ పథకాన్ని వర్తింపచేసిన ఘనత దేశంలోనే తమ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఒకటో తరగతి విద్యార్థి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు ఈ పథకాన్ని అందిస్తున్నామని ఆయన చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 67.27 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకాన్ని అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.8,700 కోట్లు కేటాయించినట్లు యార్లగడ్డ తెలిపారు. 2019 ఎన్నికల్లో ఇంట్లో ఎంతమంది విద్యార్థులున్నా అందరికీ అమ్మవొది పథకాన్ని అందిస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటికి ఒక విద్యార్థికి ఇస్తూ కేవలం 42 లక్షల మంది విద్యార్థులకు మాత్రమే ఈ పథకాన్ని అందించారని, ఈ విధంగా విద్యార్థులను తల్లిదండ్రులు మోసం చేశారని విమర్శించారు. తల్లికి చెల్లికి గౌరవం ఇవ్వలేని వ్యక్తి తల్లికి వందనం కార్యక్రమం పై అవాకులు చవాకులు పేలటం దారుణమన్నారు. తల్లికి వందనం కార్యక్రమం పై వైసీపీ అధ్యక్షుడితో సహా పేటీఎం బ్యాచ్ చేస్తున్న విష ప్రచారాన్ని యార్లగడ్డ ఖండించారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి నిధులు ఎప్పుడు వస్తాయో తెలియక విద్యార్థులు తల్లిదండ్రులు ఎదురు చూస్తూ ఉండేవారని గుర్తుచేశారు. విద్యార్థులకు ఇచ్చే చిక్కీలు కోడిగుడ్లలో సైతం కమిషన్ దండుకున్నారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి ఈ పథకాన్ని వర్తింపచేయటం జగన్మోహన్ రెడ్డికి మింగుడు పడటం లేదన్నారు. గత ప్రభుత్వము కన్నా తమ ప్రభుత్వం సామాజిక పెన్షన్ల రూపంలో ఏడాదికి రూ. 13వేల కోట్లు, అన్నదాత సుఖీభవ పథకానికిరూ. 6,500కోట్లు, మత్స్యకార భరోసా పథకానికి రూ. 150 కోట్లు నిధులు అదనంగా ఇవ్వడంతో పాటు కొత్తగా ఏడాదికి మూడు సిలిండర్లు పథకానికి రూ. 2,600కోట్లు చొప్పున ఏడాదికి 20 వేల కోట్ల రూపాయలు అదనంగా ఇస్తున్నట్లు యార్లగడ్డ గణాంకాలతో సహా వివరించారు. పేదవాడి ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. గత ఐదేళ్లు అరాచక పాలనతో అభివృద్ధిలో అట్టడుగు చేరిన రాష్ట్రంలో అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతూనే, సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తూ ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఈ సందర్భంగా యార్లగడ్డ పిలుపునిచ్చారు.

# ఆత్మకూరు జగన్ కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించిన మంత్రి నారా లోకేష్

- డ్రైనేజీ, కరెంటు, పిచ్చి మొక్కల తొలగింపు వంటి పలు సమస్యలను పరిష్కరించిన మంత్రి నారా లోకేష్
- కాలనీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించిన సచివాలయ సిబ్బంది
- వెంటనే సమస్యలు పరిష్కరించిన మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన కాలనీ వాసులు

మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో కొత్తగా నిర్మించినటువంటి జగన్ కాలనీలోని సమస్యలను స్థానికులు ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కాలనీలో పిచ్చి మొక్కల వల్ల విష సర్పాలు, దోమల బెడద అధికంగా ఉందని, కాలనీలోకి వెళ్లే రోడ్లకి ఇరువైపులా తుమ్మ చెట్లు పెద్దవిగా పెరగటం వల్ల రాకపోకలకు ఆటంకం కలుగుతుందని, కరెంటు సౌకర్యం సరిగ్గా లేదని, డ్రైనేజీ, రోడ్డు పరిస్థితి సరిగ్గా లేదని సౌకర్యం లేదని మంత్రి నారా లోకేష్‌కు విన్నవించుకున్నారు. తక్షణమే స్పందించిన మంత్రి నారా లోకేష్ చర్యలు చేపట్టారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషాను వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. దీనితో కమిషనర్ సచివాలయ సిబ్బందితో మంగళవారం ఉదయమే కాలనీలో పర్యటించి మంచినీటి సౌకర్యం, కరెంటు సౌకర్యం, రోడ్డుకి ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించడం జరిగింది. అలాగే ప్రజల కోరిక మేర స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఎక్కువగా రేషన్ కార్డు సమస్యలు, తల్లికి వందనం, రైతు భరోసా అప్లికేషన్లను వెరిఫికేషన్ చేయడం జరిగింది. కాలనీవాసులు అడిగిన వెంటనే మంత్రి నారా లోకేష్ కమిషనర్ పంపించి సమస్యలు పరిష్కరించినందుకు కాలనీవాసులు నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధికారులు పాల్గొన్నారు



# జగన్ అత్యాశ, అహంకారమే వైసీపీ కార్యకర్తల ప్రాణాల మీదకు తెచ్చింది

- వైనాట్ 175 అంటూ అమాయకుల్లో ఆశలు రేపి వారి చావులకు కారకుడయ్యాడు
- నాగమల్లేశ్వరరావుని టీడీపీ వేధించడమనేది వైసీపీ బూటకపు ప్రచారం మాత్రమే : ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): "తాను సాగించిన విధ్వంస, వినాశకర పాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని తెలిసీ, వాస్తవాలు దాచి సొంత కార్యకర్తలు.. అభిమానుల చావులకు పరోక్షంగా జగనే కారకుడయ్యాడు. వైనాట్ 175 అంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శించి, వారిలో లేనిపోని ఆశలు రేకెత్తించాడు. కచ్చితంగా గెలుపు మనదే అంటూ వారిని ఆశపల్లకీలో ఊరేగించి, బెట్టింగ్‌లు, పందేలకు పాల్పడేట్టు ఉసిగొలిపాడు. ప్రజాస్వామ్యంలో పరామర్శలకు ఒక విలువ ఉంది. కానీ జగన్ కుట్ర రాజకీయాలే లక్ష్యంగా శవాలతో రాజకీయం చేస్తున్నాడు. అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై గొంతెత్తి... పాలకపక్షానికి నిర్మాణాత్మక సూచనలు సలహాలు ఇవ్వడం జగన్ కు చేతగాదు. కానీ ప్యాలెస్ లలో ఉంటూ...వారాంతాల్లో రాష్ట్రంలో రాక్షస రాజకీయం చేయడానికి మాత్రం వెంపర్లాడుతుంటాడు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో మరణించిన వైసీపీ కార్యకర్త నాగమల్లేశ్వరరావు పలుకేసుల్లో నిందితుడు. అలాంటి 33 మందిని గత ఎన్నికల వేళ పోలీసులు ముందస్తు జాగ్రత్తచర్యల్లో భాగంగా అదుపులోకి తీసుకున్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం పోలీసులు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటే, దానికి తెలుగుదేశానికి ఏం సంబంధం? అప్పుడు అధికారంలో ఉన్న జగన్... అంబటి రాంబాబు నాగమల్లేశ్వరరావుసహా ఇతరుల్ని ఎందుకు విడిపించలేదు? నాగమల్లేశ్వరావుని టీడీపీ వేధించింది అనడం జగన్.. వైసీపీ బూటకపు ప్రచారం మాత్రమే. తెనాలిలో గంజాయి బ్యాచ్ ను పరామర్శించడం.. పొదిలిలో రౌడీమూకలతో మహిళలపై దాడులు చేయించడం.. ఇప్పుడు నాగమల్లేశ్వరరావు విగ్రహావిష్కరణ పేరుతో ప్రశాంతమైన సత్తెనపల్లిలో అందోళనలు రేపే ప్రయత్నం.. ఇవన్నీ జగన్ కుట్ర రాజకీయాల్లో భాగమే. అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతమైతే చంద్రబాబుకు, కూటమిప్రభుత్వానికి మంచిపేరు వచ్చి, జాతీయ స్థాయిలో రాష్ట్రప్రతిష్ఠ పెరుగుతుందన్న ఈర్ష్యతోనే జగన్ సత్తెనపల్లి కేంద్రంగా శవ రాజకీయాలకు సిద్ధమయ్యాడు." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో తెలిపారు.

# చరిత్రలో నిలిచిపోయేలా యోగాంధ్రకు ఏర్పాట్లు: చీఫ్ విప్ జీవీ

**●యోగాంధ్రపై విశాఖ వీఎంఆర్డీఏ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమావేశం**

**●చీఫ్ విప్ జీవీ, మంత్రులు అచ్చెన్నాయుడు, డోలా, అనగాని, అనిత, బీసీ జనార్దన్ రెడ్డి హాజరు**



వినుకొండ /విశాఖపట్నం (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2025 చరిత్రలో నిలిచి పోయేలా ఏర్పాట్లు ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ప్రజాప్రతినిధులు, పోలీసు సహా స్థానిక యంత్రాంగం, రాష్ట్రస్థాయి అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. విశాఖలో ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర -2025 కార్యక్రమంపై మంగళవారం విశాఖ వీఎంఆర్డీఏ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, డోలా బాలవీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగానే ఈ కార్యక్రమానికి భీమిలి నియోజకవర్గం పరిశీలకుడిగా కూడా ఉన్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ యోగాంధ్ర-2025 కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రతిష్ఠను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పే అవకాశంగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని విభాగాల సమన్వయంతో, ముఖ్యంగా స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేయడం ద్వారా ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందని సూచించారు. మరీ ముఖ్యంగా యువత, విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని, యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు. భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల సౌలభ్యం కోసం అధికారులు, పోలీసు శాఖ కలిసి సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ అంశాలన్నిటి పై సుదీర్ఘంగా చర్చించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు సమన్వయంలో ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా ముదుకు సాగాలని నిర్ణయించారు. ప్రజలందరి భాగస్వామ్యంతో యోగాంధ్రకు మరింతగా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు.



# తల్లికి వందనం పథకం వైసీపీకి మరణ శాసనం : నెట్టెం



జగ్గయ్యపేట (చైతన్యరథం): తల్లికి వందనం పథకం వైసీపీకి మరణ శాసనమని, ప్రతి తల్లి సంతోషంగా ఉండేలా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురామ్ వ్యాఖ్యానించారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం ద్వారా రూ.15 వేలు ఇస్తుంటే వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.2 వేలు లోకేష్ జేబుల్లోకి పోయాయంటూ వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని, దమ్ముంటే రుజువు చేయండి. ఆధారాలు లేని ఆరోపణలు చేయడమే వైసీపీ నేతల పనిగా పెట్టుకున్నారని, కనీసం తల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్‌రెడ్డి నేడు తల్లికి వందనం గురించి మాట్లాడడం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో రూ.13వేలు ఇచ్చి జగన్ మిగతా రూ.2 వేలు ఆయన జేబులో వేసుకున్నారా? అని ప్రశ్నించారు. జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే అమ్మఒడి ఇస్తే... కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇచ్చిందన్నారు. ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌బాబు నిలబెట్టుకున్నారని, ప్రతి విద్యార్థికి తల్లికి వందనం వర్తింపు చేయాలని నారా లోకేష్ కృషి చేస్తుంటే బులుగు ముఠా విష ప్రచారం చేస్తుందన్నారు. పిల్లల స్కూలు ఫీజు కోసం అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా నారా లోకేష్ తల్లికివందనం కార్యక్రమాన్ని తల్లులకు అందిస్తున్నారని అన్నారు. కుటుంబంలో ఒక్కరికే అనే షరతు పెట్టి పేద, మధ్య తరగతి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను జగన్ మోహన్ రెడ్డి మానసికంగా వేధింపులకు గురి చేసిన విషయం వాస్తవం కాదా? అని నిలదీశారు. ఒక బిడ్డ ఉన్నా... నలుగురు ఉన్నా... అందరికీ తల్లికి వందనం ఇస్తున్నామని, తల్లులు మోసం చేసింది జగన్ కాదా? "కేజి నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తాను. ఎంతవరకు చదువుకుంటే అంతవరకు చదివిస్తాను.. మేనమామగా చెబుతున్నాను" అని మాటలు చెప్పి బడుగు బలహీన, మైనార్టీ వర్గాలకు చందిన 12 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేసింది జగనేనని అన్నారు. సంక్షేమానికి నాంది పలికింది తెలుగుదేశంపార్టీ అని అమరావతి, పోలవరం కూడా నిర్మించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడం ఖాయమని అన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆర్థిక భరోసా : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొందని, సంక్షేమం, అభివృద్ధి రెండు జోడు గుర్రాల్లా పరుగులు తీస్తున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మంగళవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఇద్దరికీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ తో ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.2.50 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు బాధితులకు అందించామని వెల్లడించారు. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసిన వెంటనే మంజూరుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో తల్లికి వందనం నిధులు జమైన తల్లిదండ్రుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని చెప్పారు. ఇకపై తమ బిడ్డల చదువులకు ఎలాంటి ఢోకా లేదనే భరోసా ప్రతి ఒక్కరిలో కనిపిస్తోందని తెలిపారు. కేవలం ఏడాది కాలంలోనే రాష్ట్రంలో ప్రగతికి ముందడుగు పడిందని, ఇది సీఎం చంద్రబాబునాయుడు వంటి విజనరీ లీడర్‌తోనే సాధ్యమని చెప్పారు. గత ప్రభుత్వంలో కనీసం సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు కూడా కేటాయించలేని స్థితిలో అధ్వాన పరిపాలన సాగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# మల్లెల సంజీవయ్య హై స్కూల్‌ను నగరంలోనే ఉత్తమ హైస్కూల్‌గా తీర్చిదిద్దుతాం

**●తల్లికి వందనం పథకం సమర్ధవంతంగా అమలు చేసిన లోకేష్‌కి ధన్యవాదాలు తెలిపిన నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి**



నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు ఏసీ నగర్‌లోని మల్లెల సంజీవయ్య హైస్కూలును నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నుడా అధికారులతో కలిసి సందర్శించి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పథకం పథకం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ... త్వరలో 11 లక్షల రూపాయలతో స్కూల్ గ్రౌండ్‌ను లెవలింగ్ చేసి పిల్లలకు ఆట పరికరాలను ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. గతంలో నేను కౌన్సిలర్‌గా ఉన్నప్పుడు గండవరం సేతురామిరెడ్డి సహకారంతో మల్లెల రామయ్యని తీసుకువచ్చి ఈ స్కూల్ బిల్డింగులు నిర్మాణం చేయించామని, ప్రస్తుతం నా సతీమణి సంధ్య ఈ స్కూలును దత్తత తీసుకుందని స్కూల్‌ను నెల్లూరు నగరంలోని ఉత్తమ స్కూల్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. వర్షాకాలం వస్తే నీళ్లు నిలబడిపోయి పిల్లలు స్కూల్లోకి వెళ్లలేని పరిస్థితి ఉండడంతో నుడా నిధులతో స్కూల్ గ్రౌండ్ ఎత్తు చేసి పిల్లలకు అవసరమైన ఆట పరికరాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. తల్లికి వందనం ఎంతమంది పిల్లలు ఉంటే కొంతమందికి ఇచ్చామని కూటమి ప్రభుత్వం చంద్రబాబు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు ఆరింట్లో నాలుగు ఇప్పటికి అమలు చేశామని అందులో తల్లికి వందనం ప్రధాన పథకం అని పేర్కొన్నారు. చెప్పిన మాట తూచా తప్పకుండా అమలు చేసే ప్రభుత్వం చంద్రబాబు ప్రభుత్వం అని జగన్మోహన్ రెడ్డి లాగా వాళ్ళ ఫోటోలు వేసుకొని పథకాలకు జగన్ పేరు పెట్టుకుని అమలు చేయలేదని, సర్వేపల్లి రాధాకృష్ణ లాంటి మహనీయుల పేర్లతో పథకాలు అమలు చేస్తున్నామని, ఒక తల్లికి ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం ఇచ్చిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని కొనియాడారు. మంత్రి నారాయణ నగరంలోని పాఠశాలన్నిటిని ఉత్తమ పాఠశాలలుగా అభివృద్ధి చేస్తున్నారని నారాయణ మంత్రిగా నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తద్వారా నెల్లూరు నగరం మంచి నగరం కాబోతుందని తెలిపారు. పాఠశాలను దత్త తీసుకున్న మాజీ కార్పొరేటర్ సంధ్య మాట్లాడుతూ... ఈ పాఠశాల అభివృద్ధికి అంకితభావంతో కట్టుబడి ఉన్నామని నగరంలో మంచి పాఠశాలగా తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తామని తెలిపారు. మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ మాట్లాడుతూ లోకేష్ విద్యాశాఖ మంత్రిగా విద్యా వ్యవస్థను ఉన్నత స్థాయికి తీసుకుపోతున్నారని కొనియాడారు.

# తల్లికి వందనం... విద్యార్థులకు ఓ వరం

**● నెల్లూరు మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ**



నెల్లూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తల్లికి వందనం అనే పథకం విద్యార్థులకు ఓ గొప్ప వరమని మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ తాళ్లపాక అనురాధ తెలిపారు. తల్లికి వందనం పథకం అమలు పట్ల నెల్లూరులోని 16వ డివిజన్ గుర్రాలమడుగు సంఘంలో టీడీపీ కార్యకర్తలు నాయకులతో ఆమె సంబరాలు నిర్వహించారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు లోకేష్, నారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. థాంక్యూ సీఎం సార్ అంటూ ప్రకార్డుల చేత పట్టి ప్రదర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో, చదువుకునే ప్రతి బిడ్డకు తల్లికివదనం నిధులు అందించారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామిని నెరవేరుస్తుందన్నారు. ఇంట్లో చదువుకునే పిల్లలందరికీ తల్లికివందనం అందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందని, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు మహిళా పక్షపాతి అని కొనియాడారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం డబ్బులు పడటంతో తల్లులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పాలాభిషేకాలతో కృతజ్ఞతలు చెబుతున్నారని కొనియాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి తల్లికి వందనం డబ్బులు పడుతాయన్నారు. ఇందుకోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె తెలియజేశారు. డబ్బులు పడని వారు సమీపంలోని సచివాలయంలో సంప్రదించాలని సూచించారు.

## యోగా చేస్తే ఎంత ఆరోగ్యంగా ఉంటారో సీఎం చంద్రబాబు ప్రత్యక్ష నిదర్శనం

- ఏడు పదుల వయసులో కూడా ఆయన యువకుడిలా పనిచేస్తున్నారు
- యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత
- పండమేరు వెంకటరమణ స్వామి దేవస్థానం వద్ద యోగా కార్యక్రమం
- యోగా మన జీవితంలో ఒక భాగం కావాలి.. ఎమ్మెల్యే సునీత పిలుపు



రాప్తాడు (చైతన్యరథం): ప్రతిరోజు యోగా చేస్తే ఎంత ఆరోగ్యంగా ఉంటారో చెప్పడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలువెత్తు నిదర్శనమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు సమీపంలోని పండమేరు వెంకటరమణ స్వామి దేవస్థానం సమీపంలోని పార్క్ లో ఏర్పాటు చేసిన యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలతో కలసి యోగా చేశారు. యోగా మాస్టర్స్ సూచించిన విధంగా ఆసనాలు వేస్తూ... అందరిలో స్ఫూర్తినింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ... యోగా అనేది మనిషికి ఎంత అవసరమో అందరూ తెలుసుకోవాలన్నారు. ఒక మనిషి యోగా చేస్తే ఎంత ఉత్సాహంగా ఉంటారన్నది... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును చూస్తే తెలుస్తుందన్నారు. ఆయన ఏడుపదుల వయసు దాటినా కూడా యువకుడిలా పనిచేస్తున్నారన్నారు. ఆయనలో ఎప్పుడూ అలసట మేము చూడలేదని సునీత అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. గత నెల 21వ తేది నుంచి ఈనెల 21వ తేది వరకు రాష్ట్రంలో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది పాల్గొనేలా కార్యాచరణ రూపొందించారని. ఈనెల 21న వైజాగ్‌లో 5లక్షల మందితో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాన్ని నిర్వహించి వరల్డ్ రికార్డ్ సాధించేలా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోడీ కూడా పాల్గొంటున్నారని.. ఆరోజు నిర్వహించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. యోగా అనేది అన్ని వయసుల వారికి చాలా అవసరమని.. యోగా సాధన చేయడం వల్ల ఒత్తిడి తగ్గి ఏకాగ్రత పెరుగుతుందన్నారు. బీపీ షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు కూడా.. తగ్గే అవకాశం ఉందన్నారు అందుకే ప్రతి ఒక్కరు దైనందిన జీవితంలో యోగాను.. అలవాటుగా మార్చుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు.

## సీఎం సహాయనిధి పేదల పెన్నిధి.. అర్హులైన ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్

- మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పంపిణీ



మడకశిర (చైతన్యరథం): ఆర్థిక స్థోమత లేక అనారోగ్యాల బారిన పడుతున్న పేదలకు సీఎం సహాయ నిధి కార్పొరేట్ వైద్యంతో స్వస్థత పొందేందుకు ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎంఎస్ రాజు తెలిపారు. పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి చేతుల మీదుగా మడకశిర నియోజకవర్గంలోని 32 మంది లబ్ధిదారులకు రూ.13.46లక్షలు విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో దాదాపు రూ.2కోట్లకు పైగా నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేయడం జరిగిందన్నారు. అనంతరం చెక్కులు అందుకున్న వారు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

**వైకాపా సీఎం రిలీఫ్ ఫండ్ నిర్వీర్యం చేస్తే.. కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది**

గత వైకాపా ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించాల్సిన చెక్కులను సైతం అవినీతిమయం చేశారు. ఆర్థిక స్తోమత లేని పేదలు కార్పొరేట్ వైద్యశాలల్లో వైద్యం చేయించుకుని ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే అప్పటి ఎమ్మెల్యేలు అందులో కూడా వాటా కావాలని పేదలను పీడించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుపేదలకు అవినీతి లేకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి సొమ్ము అందించాలనే ఉద్దేశంతో అర్హులైన ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నారని అన్నారు.

## మురళీ నాయక్ కుటుంబానికి అండగా ఉంటాం



- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- వీరజవాను తల్లిదండ్రులకు పరామర్శ
- ప్రభుత్వం తరపున రూ.50 లక్షల చెక్ అందజేత
- 5 ఎకరాలు, 6 సెంట్ల స్థలం పట్టాలు కూడా...

గోరంట్ల/శ్రీ సత్యసాయి : దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాను మురళీ నాయక్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ లో భాగంగా వీర మరణం పొందిన శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన మురళీ నాయక్ తల్లీతండ్రులను మంత్రి సవిత మంగళవారం పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 50 లక్షల చెక్కును, అయిదెకరాల స్థలాన్ని, ఆరు సెంట్ల ఇళ్ల స్థలం పట్టాలను మురళీ నాయక్ తల్లిదండ్రులకు మంత్రి సవిత అందజేశారు. భరతమాత ముద్దు బిడ్డ మురళీ నాయక్ అని కొనియాడారు. దేశ ప్రజలందరి గుండెల్లో మురళీ నాయక్ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. దేశ ప్రజలతో పాటు కూటమి ప్రభుత్వం కూడా అండగా ఉంటుందని వీర జవాను తల్లిదండ్రులను ఓదార్చారు. ఏ కష్టం వచ్చినా తనను సంప్రదిస్తే వెన్నుదన్నుగా ఉంటానని భరోసా ఇచ్చారు. అంతకుముందు కల్లితండాలోని మురళీ నాయక్ ఘాటు వద్దకెళ్లి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. మురళీ నాయక్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. త్వరలోనే మురళీ నాయక్ నివాసం నుంచి ఘాటు వరకూ రూ. 16 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు వెల్లడించారు. గోరంట్లతో పాటు జిల్లా కేంద్రంలో కూడా మురళీ నాయక్ కాంస్య విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒకే కుటుంబంలో 12 మంది పిల్లలకు తల్లికి వందనం


- రూ.1.56 లక్షలు రావడంతో హర్షం వ్యక్తం చేసిన అన్నమయ్య జిల్లాకి చెందిన పహసీనుల్లా కుటుంబసభ్యులు

తల్లికి వందనం పేరుతో రాష్ట్రంలో తల్లుల్లో ఆనందాన్ని నింపింది ఏపీ సర్కార్. అర్హులందరికీ సూపర్ సిక్స్‌లోని తల్లికి వందనం పథకాన్ని అమలు చేసింది. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది అర్హులకు ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పిన మాట మేరకే నగదు జమ చేసింది. విద్యా సంవత్సరం ప్రారంభం రోజే పథకాన్ని అమలు చేసి ఊహించని సహాయం పేద కుటుంబాలకు చేసింది. ఇలా రాష్ట్రంలోని అమ్మల కళ్ళల్లో ఆనందం నింపిన ప్రభుత్వం అన్నమయ్య జిల్లాలోని ఒక ఉమ్మడి కుటుంబంలో 12 మంది పిల్లలను తల్లికి వందనం పథకానికి అర్హులుగా గుర్తించింది. కలకడకు చెందిన హసీనుల్లాకు నలుగురు కొడుకులు కాగా ఉమ్మడి కుటుంబంలో ఉన్న నలుగురు తల్లుల సంతానం 12 మందికి తల్లికి వందనం డబ్బులు జమ చేసింది. 12 మంది పిల్లలకు గాను మొత్తం రూ.1.56 లక్షల నగదు బదిలీ చేసింది. కలకడకు చెందిన టి.నసీన్, బి.ముంతాజ్, ఇరానీ, ఆసియా అనే తల్లుల అకౌంట్‌లలో నగదు జమ అయింది. దీంతో ఆ కుటుంబంలో ఆనందానికి హద్దుల్లేకుండా పోయింది. పేదరిక కుటుంబానికి ఒకేసారి తల్లికి వందనం పేరుతో ఒకే ఇంటిలో 12 మందికి రూ.1.56లక్షలు రావడంతో హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు. కుటుంబ సభ్యులు. ఇదిలా ఉండగా కలకడ మండలంలోనే తల్లికి వందనం పథకం కింద పెద్ద మొత్తంలో నగదు జమ అయిన కుటుంబంగా నిలబడింది. ఈ విషయాన్ని ఎక్స్‌లోనూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొనడం విశేషం. ఎంత మంది పిల్లలు ఉంటే అంత ఆదాయం జనాభాను పెంచండి పిలల్ని కనండని సీఎం చెప్పినట్లు కలకడలో ఒక కుటుంబానికి తల్లికి వందనం పథకం ఊహించని ఆదాయాన్ని సమకూర్చింది.



## తల్లికి వందనంపై బులుగు మీడియా విష ప్రచారం : మంత్రాలయం టీడీపీ ఇన్‌ఛార్జ్ రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం (చైతన్యరథం): జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే అమ్మఒడి ఇస్తే కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మందికి తల్లికి వందనం ఇచ్చిందని, మంత్రాలయం టీడీపీ ఇన్‌ఛార్జ్ ఎన్.రాఘవేంద్రరెడ్డి వ్యాఖ్యానించారు. తల్లికి వందనంపై బులుగు మీడియా విషం చిమ్ముతుందని, ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం కార్యక్రమం కింద రూ.13,000 ఇస్తుంటే వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని అన్నారు. రూ.2 వేలు నారా లోకేష్‌బాబు జేబుల్లోకి పోయాయంటూ వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు చేశారు. వైసీపీ పాలనలో రూ.13,000 ఇచ్చారంటే రూ.2,000 జగన్ జేబులోకి పోయ్యాయా? లేదా తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా? అని నిలదీశారు. కుటుంబంలో ఒక్కరికే అనే షరతు పెట్టి పేద, మధ్య తరగతి విద్యార్థులను వారి తల్లిదండ్రులను జగన్మోహన్‌రెడ్డి మానసికంగా వేధింపులకు గురి చేసిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తామని ఎంతవరకు చదువుకుంటే అంతవరకు చదివిస్తాను మేనమామగా చెబుతున్నాను అని మాటలు చెప్పి బడుగుబలహీన మైనారిటీ వర్గాలకు చెందిన 12 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసింది వైసీపీ వాళ్లే కదా? అని నిలదీశారు. 2019 ఎన్నికల ప్రచారంలో మీ ఇంట్లో ఇద్దరు పిల్లల్ని బడికి పంపండి ఒక్కొక్కరికి రూ.15000 చొప్పున ఇస్తామని భారతీరెడ్డి ప్రచారం చేయలేదా? అధికారంలోకి వచ్చాక ప్రతి కుటుంబంలో ఒకేఒక విద్యార్థికే 13 వేల రూపాయలు ఇస్తామంటూ నాలుక మడత పెట్టింది జగన్ రెడ్డి నువ్వు కాదా? పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి లబ్ధి చేకూరుస్తుంటే బెంగుళూరులో కూర్చొని జగన్‌రెడ్డి విష ప్రచారం చేస్తున్నాడు. ప్రతి విద్యార్థి చదువుకునేందుకు దోహదపడే విధంగా నేరుగా వారి తల్లి ఖాతాలో డబ్బులు వేస్తుంటే స్వాగతించకుండా తప్పుడు ప్రచారాలు చేయడం జగన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. వైసీపీ హాయంలో ఈ పథకం కోసం కేవలం రూ.5000 కోట్లు ఖర్చు పెడితే కూటమి ప్రభుత్వం రూ.10000 కోట్లు మేర ఖర్చు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసింది. రూ.2000 లోకేష్ బాబు కొట్టేశారు అంటూ వైసీపీ చేస్తున్న దుష్ప్రచారంపై జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



## ఎయిర్ ఇండియా విమానాల్లో
# వరుస సాంకేతిక లోపాలు

**ఢిల్లీ-ప్యారిస్ సర్వీసు రద్దు - అహ్మదాబాద్-ఢిల్లీ సర్వీసు కూడా**



న్యూఢిల్లీ: దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియాలో వరుస ఘటనలు భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఈ సంస్థకు చెందిన బోయింగ్ డ్రీమ్ లైనర్ నిమానం ఇటీవల లండన్ వెళ్తుండగా అహ్మదాబాద్లో ఘోర ప్రమాదానికి గురైన ఘటన మరవరముందే.. మరిన్ని విమానాల్లో సాంకేతిక లోపాలు బయటపడటం కలవరపెడుతోంది.

ఢిల్లీ నుంచి పారిస్‌కు మంగళవారంనాడు వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో సర్వీసును రద్దు చేశారు. విమానం వెళ్లడానికి ముందు చేపట్టిన తనిఖీల్లో సాంకేతిక లోపం కనిపించడంతో ఫ్లైట్ సర్వీసును రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. ఏఐ-143 విమానంలో ప్రీ ఫ్లయిట్ చెకింగ్‌లో కనిపించిన సాంకేతిక లోపాన్ని సరిచేసే పనిలో సాంకేతిక నిపుణులు ఉన్నట్టు ఏఐ ప్రతినిధి తెలిపారు.

సమయాభావంతో పాటు పారిస్‌లోని చార్సెల్ డి గాలే అంతర్జాతీయ విమానశ్రయం వద్ద అర్ధరాత్రి వేళల్లో ఆంక్షలు ఉన్నందును విమాన సర్వీసును రద్దు చేయడం మినహా మరో మార్గం లేకపోయిందని అధికారులు చెప్పారు. దీంతో ఈ నెల 18న పారిస్ నుంచి ఢిల్లీకి రావాల్సిన రిటర్న్ ఫ్లయిట్ ఏఐ-142 కూడా రద్దయిందని తెలిపారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, సాధ్యమైనంత త్వరలో ప్రయాణికులను వారి గమ్యాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. హోటల్ సదుపాయంతో పాటు టిక్కెట్ అమౌంట్ తిరిగి చెల్లించేందుకు, కోరుకుంటే ప్రయాణం రీషెడ్యూల్‌కు కూడా వెసులుబాటు కల్పిస్తున్నట్టు వివరించారు.

కాగా, దీనికిముందు అహ్మదాబాద్ నుంచి లండన్‌కు వెళ్లాల్సిన ఎయిరిండియా ఏఐ-159 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్‌లోనూ సాంకేతిక లోపాలు తలెత్తాయి. మంగళవారం మధ్యాహ్నం 1.10 గంటలకు అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరాల్సి ఉంది. ఈ క్రమంలోనే విమానంలో తనిఖీలు చేస్తుండగా... సాంకేతిక సమస్యను గుర్తించారు. దీంతో టేకాఫ్ నిలిపివేసి సర్వీసును రద్దు చేశారు. గత వారం నాటి విమాన ప్రమాదం తర్వాత లండన్‌కు వెళ్లాల్సిన తొలి షెడ్యూల్డ్ విమానం ఇదే కావడం గమనార్హం.

అయితే, సాంకేతిక సమస్య వార్తలను ఎయిరిండియా తోసిపుచ్చింది. విమానం అందుబాటులో లేకపోవడం వల్లే సర్వీసును రద్దు చేసినట్లు తెలిపింది. "గగనతల ఆంక్షలు, అదనపు ముందు జాగ్రత్త తనిఖీలు తదితర కారణాలతో ఆ విమానం అందుబాటులో లేదు. అందువల్లే అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లే సర్వీసును రద్దు చేశాం. అంతేగానీ సాంకేతిక సమస్య వల్ల కాదు" అని ఎయిరిండియా ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి విచారం వ్యక్తం చేసింది. వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపింది. టికెట్ క్యాన్సిల్ చేసుకోవాలనుకుంటే పూర్తి రీఫండ్ ఇస్తామని పేర్కొంది.

## ఇరాన్ నుంచి ఆర్మేనియాకు
# 110 మంది భారతీయ విద్యార్థులు



న్యూఢిల్లీ: ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్రతరమవుతున్న క్రమంలో అక్కడున్న భారతీయులను, విద్యార్థులను తరలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా 110 మందితో కూడిన మొదటి విద్యార్థుల బ్యాచ్ ఇప్పటికే ఆర్మేనియా దేశం చేరుకుంది. అక్కడి నుంచి వారిని తొలి బ్యాచ్ కింద బుధవారం ఇండియాకు తరలించే అవకాశం ఉంది.

ప్రస్తుతం సుమారు 10,000 మంది భారతీయులు ఇరాన్‌లో ఉన్నట్టు కేంద్ర విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. వీరిలో 6,000 మంది విద్యార్థులు ఉన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా భారతీయులను తరలిస్తున్నట్టు విదేశాంగ తెలిపింది. ఇజ్రాయెల్ దాడులతో ఇంతకుముందు సుమారు 600 మంది విద్యార్థులను టెహ్రాన్ నుంచి ఖోమ్ సిటీకి తరలించారు. మరికొందరిని షిరాజ్, ఇస్ఫాన్ నుంచి యాజ్డ్ నగరానికి తరలించారు. టెహ్రాన్ సిటీ నుంచి దూరంగా తరలించేందుకు అక్కడి భారత రాయబార కార్యాలయం ఏర్పాట్లు చేసిందని విదేశాంగ శాఖ తెలిపింది. భద్రతా పరిస్థితిని టెహ్రాన్ ఇండియన్ ఎంబసీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని, ఇరాన్‌లోని భారతీయుల భద్రతకు చర్యలు తీసుకుంటోందని పేర్కొంది. కొందరిని ఇరాన్‌లోనే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఇతర మార్గాలను కూడా అన్వేషిస్తున్నామని పేర్కొంది.

ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులతో టెహ్రాన్ నగరంలోని ఇండియన్ ఎంబసీ అడ్వయిజరీ జారీ చేసింది. అక్కడున్న భారతీయులు టెహ్రాన్ వీడి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. భారత ఎంబసీతో కాంటాక్టులో ఉండాలని కోరింది. ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా భారతీయులను తరలిస్తున్నట్లు విదేశాంగ శాఖ పేర్కొంది. సొంత రవాణా సదుపాయం ఉన్నవారు కూడా ఈ ప్రాంతాన్ని వీడాలని కోరింది. తక్షణమే టెహ్రాన్ నగరాన్ని వీడి వెలుపల సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని భారతీయులకు పేర్కొంది. ఇప్పటివరకు భారత ఎంబసీని సంప్రదించని భారతీయులు వెంటనే దౌత్యాధికారులతో కాంటాక్ట్ అవ్వాలని కోరింది.

## రెండురోజులుగా తిరువనంతపురం ఎయిర్‌పోర్టులోనే..
# నిలిచిన అత్యంత శక్తిమంతమైన ఫైటర్ జెట్



తిరువనంతపురం: ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన ఫైటర్ జెట్లలో ఒకటైన ఎఫ్-35 బి రెండు రోజులుగా కేరళలోని తిరువనంతపురం ఎయిర్పోర్టులోనే ఉండిపోయింది. ఇది బ్రిటన్ నౌకాదళానికి చెందిన హెచ్ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్‌లో భాగం. ఆ యుద్ధనౌక ఇటీవలే ఇండో-పసిఫిక్ భారత నేవీతో కలిసి సంయుక్తంగా యుద్ధ విన్యాసాలు చేసింది. బ్రిటన్ రాయల్ నేవీకి చెందిన ఇది తొలుత ఇంధనం తగ్గిపోవడంతో ఆదివారం ఇక్కడ అత్యవసరంగా ల్యాండ్ అయిందని భావించారు.

కానీ, 48 గంటలు గడిచినా అదే ఎయిర్‌పోర్టులో ఉండటంతో ఈ ఫైటర్ జెట్‌కు ఏదో సాంకేతిక సమస్య వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫైటర్ జెట్‌కు సీఐఎస్ఎఫ్ దళాలు భద్రత కల్పిస్తున్నాయి. మన దేశంలో ఓ విదేశీ యుద్ధ విమానం రెండ్రోజులపాటు నిలిచిపోవడం.. అందులోనూ ఎఫ్-35 వంటి 5వ తరం స్టెల్త్ జెట్ మొరాయించడం సాధారణ విషయం కాదు. ఈ విమానానికి షార్ట్ టేకాఫ్ తోపాటు వర్టికల్ ల్యాండింగ్ అయ్యే సామర్థ్యం ఉంది. అమెరికా సహా అతికొద్ది దేశాల వైమానిక దళాల వద్దే ఈ ఫైటర్ జెట్ ఉంది. ప్రస్తుతం ఇజ్రాయెల్ కూడా దీనిలోనే మరో వేరియంట్ విమానాన్ని ఇరాన్‌పై దాడులకు వాడుతోంది.

ఈ ఏడాది మొదట్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ రకం యుద్ధ విమానాలను భారత్‌ను ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ట్రంప్ ఈ ప్రకటన చేసిన సమయంలో ప్రధాని మోదీ కూడా ఆయన పక్కనే ఉన్నారు.

## నో ఫ్లయింగ్ జోన్‌గా అమర్‌నాథ్ యాత్ర మార్గం

శ్రీనగర్: కశ్మీర్‌లోని అమర్‌నాథ్ మంచు లింగాన్ని దర్శించుకోవడానికి ఏటా వేల మంది యాత్రికులు అమర్నాథ్ యాత్రకు వెళ్తారు. ఈ ఏడాది కూడా మరికొద్ది రోజుల్లో ఈ వార్షిక యాత్ర ప్రారంభం కానుంది. అయితే, ఇటీవల పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన నేపథ్యంలో జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఈ యాత్రకు భద్రతను కట్టుదిట్టం చేసింది. ఇందులో భాగంగానే.. అమర్నాథ్ యాత్ర వెళ్లే అన్ని మార్గాలను 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటించింది.

ఈ మేరకు జమ్మూకశ్మీర్ హోం శాఖ మంగళవారం దీనిపై ఉత్తర్వులు జారీ చేసింది. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. సాధారణంగా అమర్నాథ్ యాత్రకు పహల్గాం మార్గంతో పాటు బాల్తాల్ మీదుగా యాత్రికులు వెళ్తుంటారు. ఈ రెండు మార్గాలను 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటించారు.

ఈ మార్గాల్లో జులై 1 నుంచి ఆగస్టు 10 వరకు మానవ రహిత వైమానిక వాహన వ్యవస్థలు, డ్రోన్లు, బెలూన్లు వంటివి ఎగరవేయడంపై నిషేదం విదించారు. అయితే, అత్యవసర వైద్య తరలింపు, విపత్తు నిర్వహణ, భద్రతా దళాల నిఘా వంటి సందర్భాలలో ఈ ఆంక్షలు వర్తించబోవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీటికి సంబంధించిన పూర్తి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను త్వరలోనే జారీ చేస్తామని అధికారులు వెల్లడించారు. జులై 3 నుంచి అమర్ నాథ్ యాత్ర ప్రారంభం కానున్న సందర్భంగా సజావుగా, శాంతియుతంగా సాగడానికి ఈ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. అంతేగాక, యాత్రికులకు అదనపు రవాణా సదుపాయాలను కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

ముంబై: అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన అనంతరం దేశంలో పలు విమానాల్లో సాంకేతిక లోపాల సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో విమాన ప్రయాణం అంటేనే ప్రయాణికుడికి ఓ విధమైన భయాందోళన కలిగించే పరిస్థితి నెలకొంది. అలాంటి వేళ.. పలు విమాన సర్వీసులకు బాంబు బెదిరింపులు వస్తున్నాయి. తాజా ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. మంగళవారం కొచ్చి నుంచి న్యూఢిల్లీకి ఇండిగో విమానం ప్రయాణికులతో బయలుదేరింది. ఆ కొద్దిసేపటికే విమానంలో బాంబు ఉందని.. మరికొన్ని నిమిషాల్లో అది పేలనుదంటూ ఆగంతకులు కొచ్చి ఎయిర్‌పోర్ట్‌కు ఫోన్ చేసి బెదిరించారు. దీంతో ఎయిర్‌పోర్ట్ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఆ క్రమంలో విమానాన్ని మళ్లించి.. నాగ్‌పూర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం విమానంలోని ప్రయాణికులకు కిందకి దింపేశారు. ఆ తర్వాత విమానాన్ని నిర్మానుష్య ప్రాంతానికి తరలించి.. తనిఖీలు చేపట్టారు. ఈ విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపులు రావాడంతో వెంటనే మళ్లించామని ఎయిర్‌పోర్ట్ అధికారులు చెప్పారు. అలాగే ఈ ఘటనపై కేంద్ర పారిశ్రామిక భద్రత దళాలు, స్థానిక పోలీసులు విచారణ చేపట్టామని ఎయిర్ పోర్ట్ అధికారులు వివరించారు.

## భర్తతోనే పురుగుల మందు కొనిపించి.. అతడికే తినిపించి!

**- పెళ్లయిన 35 రోజులకే నవ వధువు ఘాతుకం**

గర్హ్వా: భర్తను చంపాలని ప్లాన్ వేసిన ఒక నవ వధువు..అతడితోనే పురుగుల మందు కొనిపించి.. అతడు తినే భోజనంలో కలిపి హత్య చేసింది. మేఘాలయలో ఇటీవల జరిగిన హనీమూన్ హత్య కేసు మరువకముందే ఈ దారుణ ఘటన వెలుగు చూసింది. పెళ్లయిన 35 రోజులకే భర్తను అతి దారుణంగా చంపింది ఓ భార్య. ఈ ఘోరమైన ఘటన జార్ఖడ్ రాష్ట్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం విష్ణుపూర్ గ్రామానికి చెందిన రఘునాథ్ సింగ్ కుమార్తె సునీతను గత నెల మే 11న జార్ఖండ్ రాష్ట్రం గర్హ్వా జిల్లాలోని బహోకుందర్ గ్రామానికి చెందిన బుధ్‌నాథ్ సింగ్ అనే వ్యక్తికి ఇచ్చి ఘనంగా వివాహం చేశారు. అయితే, వివాహం జరిగిన మరుసటి రోజే నవ వధువు సునీత తనకు భర్త అంటే ఏ మాత్రం ఇష్టం లేదని చెప్పి తన పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే, ఇరు కుటుంబాల పెద్దలు పంచాయతీ పెట్టి సునీతకు నచ్చజెప్పి మళ్లీ తనను కాపురానికి పంపించారు. అయితే, భర్త అంటే ఇష్టం లేని సునీత తనను ఎలాగైనా చంపాలని పథకం వేసింది. ఈ నేపథ్యంలోనే గత శనివారం భర్తతో కలిసి సునీత మార్కెట్‌కు వెళ్లింది. అయితే, కూరగాయ చెట్లకు మందు కొట్టాలనే సాకుతో భర్తతో పురుగులమందు కొనిపించుకుంది. మరుసటి రోజు ఆదివారం రాత్రి భర్త తినే భోజనంలో ఆ మందు కలిపి పెట్టినట్లు తెలుస్తోంది. ఇక రాత్రి భోజనం చేసి నిద్రపోయిన భర్త బుధ్‌నాథ్ నిద్రలోనే తన ప్రాణాలు కోల్పోయాడు. మరుసటి రోజు ఉదయం బుధ్‌నాథ్ మృతి చెందాడని తెలుసుకున్న అతడి తల్లి, కుటుంబ సభ్యులు ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొడుకు తినే భోజనంలో తన కోడలే విషం కలిపిందని పోలీసు అధికారులకు మృతుడి తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు భార్య సునీతను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## ఇరాన్‌లో ఏం జరగబోతోంది?

# జీ7 వేదిక వీడి అమెరికా చేరిన ట్రంప్

*టెహ్రాన్ గగనతలం తమ ఆధీనంలో ఉందన్న ఇజ్రాయెల్ - టెహ్రాన్ వీడి వెళ్లమంటూ పౌరులకు ట్రంప్ సూచన - ఇరాన్‌కు గుండెలాంటి 'ఫార్డో'ను టార్గెట్ చేయొచ్చన్న అనుమానాలు*



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హడావుడిగా జీ7 వేదికను వీడి అమెరికాకు తిరుగు ప్రయాణం కావడంతో.. సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. టెహ్రాన్ గగనతలాన్ని పూర్తిగా ఆధీనంలోకి తీసుకొన్నామని ఇజ్రాయెల్ ప్రకటించిన వేళ.. ఈ పరిణామాలు చోటుచేసుకొన్నాయి. ఆ నగరాన్ని ప్రజలు ఖాళీ చేసి వెళ్లిపోవాలని ట్రంప్ స్వయంగా హెచ్చరికలు జారీ చేయడం దీనికి ఆజ్యం పోసినట్లైంది. ఇరాన్‌లోని అణుకేంద్రాలు పెద్దగా దెబ్బతినలేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అధిపతి రఫాలే గ్రూసీ వెల్లడించారు. శుక్రవారం చేసిన దాడులు మినహా మిగిలినవి పెద్దగా వీటిపై ప్రభావం చూపలేదని అభిప్రాయపడ్డారు. నతాంజ్‌లోని భూగర్భ అణుశుద్ధి కేంద్రంపై పెద్దగా వీటి ప్రభావం లేదని పేర్కొన్నారు. విద్యుత్తు సరఫరా అంతరాయాలు వంటివి చోటుచేసుకొని అక్కడి మొత్తం 15,000 సెంట్రిఫ్యూజ్‌లు దెబ్బతిని ఉండొచ్చన్నారు. అంతేకానీ ఇవి ధ్వంసమై ఉంటాయని తాము అనుకోవటం లేదని వెల్లడించారు. నతాంజ్, ఫార్డో అణు కేంద్రాలను భూగర్భంలో లోతుగా నిర్మించారు. వీటిని పేల్చేయాలంటే అత్యంత భారీ శ్రేణికి చెందిన జీబీయూ-57 బంకర్ బస్టర్ బాంబులు అవసరం. అవి అమెరికా వద్ద మాత్రమే ఉన్నాయి.

### ఫార్డోను ధ్వంసం చేయడం.. అమెరికాకు అత్యంత కీలకం



ఇరాన్‌లోని ఫార్డో అణుకేంద్రంలో యురేనియంను 60శాతానికి పైగా శుద్ధి చేయగలరు. ఇది అణుబాంబులు తయారీ చేయడానికి అవసరమైన దానికి చాలా సమీపంలో ఉన్నట్లే లెక్క. 2023లో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఈ కేంద్రంలో 83.7శాతం శుద్ధి చేసిన యురేనియంను గుర్తించింది. అణుబాంబుకు అవసరమైన 90 శాతానికి ఇది చాలా దగ్గరగా ఉంది. ఫార్డో కేంద్రాన్ని ఓ పర్వతం లోపల సొరంగాల్లో నిర్మించారు. ఇక్కడ 3,000 సెంట్రిఫ్యూజు లున్నట్లు అంచనా. దీనిని సాధారణ బాంబులు ధ్వంసం చేయలేవు. ఇరాన్‌నుంచి అణుబాంబు తయారీని దూరం చేయాలంటే దీనిని ధ్వంసం చేయడం అమెరికా, ఇజ్రాయెల్‌కు చాలా ముఖ్యం.

### అణుకేంద్రాలపై దాడి..?

ట్రంప్ హడావుడిగా సిట్యుయేషన్ రూమును సిద్ధం చేయించి.. వాషింగ్టన్‌కు తిరిగి రానుండటంతో... అమెరికా కూడా ఇరాన్ అణుకేంద్రాలను ధ్వంసం చేయడంలో ఇజ్రాయెల్‌తో చేతులు కలపనుందనే ప్రచారం జోరందుకుంది. ఇందుకోసం దాదాపు 20 అడుగుల పొడవుండే జీబీయూ-57 అనే భారీ బంకర్ బస్టర్ బాంబును వాడాల్సిందే. ఇది సుమారు 13,600 కిలోల బరువు ఉంటుంది. దీనిని కేవలం అమెరికాకు తురుపు ముక్క అయిన బి-2 స్పిరిట్ బాంబర్లు మాత్రమే ప్రయోగించగలవు. కొన్ని నెలల క్రితమే ఈ రకానికి చెందిన దాదాపు 5 యుద్ధ విమానాలను పశ్చిమాసియా సమీపంలోని డియగో గార్సియా బేస్‌కు చేర్చింది. దీనికితోడు రీఫ్యూయలింగ్ ట్యాంకర్లు, ఇతర యుద్ధ విమానాలు, ఆయుధాలను అమెరికా పశ్చిమాసియాకు తరలిస్తోంది. ఆ దేశ విమాన వాహక నౌక యూఎస్ఎస్ నిమిట్జ్ కూడా ఇప్పటికే ఈ దిశగా బయల్దేరింది. ఓ పోర్టు విజిట్‌ను కూడా రద్దు చేసుకొని ఇది పశ్చిమాసియాకు ప్రయాణం కట్టడం గమనార్హం.







దీంతోపాటు డెస్ట్రాయర్లు ఇతర సహాయక నౌకలూ వస్తున్నాయి. బ్రిటన్ కూడా తన ఫైటర్ జెట్లను మోహరిస్తుండటం టెన్షన్ పెంచుతోంది. అమెరికా కూడా ఇజ్రాయెల్‌తో కలిసి యుద్ధం చేస్తుందన్న ప్రచారంపై ప్రముఖ వ్యాఖ్యాత టకర్ కార్ల్‌సన్ టంప్‌ను విమర్శించారు. దీనికి అమెరికా అధ్యక్షుడు తనదైన శైలిలో స్పందిస్తూ "ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదు అన్న విషయాన్ని ఎవరైనా ఆ టకర్ కార్ల్‌సన్‌కు వివరించండి' అని వెటకారంగా చెప్పడం గమనార్హం. దీంతోపాటు సోషల్ మీడియా పోస్టులో కూడా ఇరాన్‌కు అణ్వాయుధం అందదు అని ట్రంప్ తేల్చిచెప్పారు. దీంతో ఆ దేశ అణు కేంద్రాలపై అమెరికా దాడి జరపొచ్చనే ప్రచారానికి బలం చేకూరుతోంది.

### కాల్పుల విరమణ కంటే పెద్దదే..!

మరోవైపు, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గురించి ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ చేసిన వ్యాఖ్యలను ట్రంప్ ఖండించారు. "నేను జీ7 సదస్సును ఎందుకు వీడుతున్నానో మేక్రాన్ తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను వాషింగ్టన్ ఎందుకు వెళు‌తున్నానో ఆయనకు తెలియదు. కాల్పుల విరమణ ఒప్పందం గురించి కాదు.. అంతకంటే పెద్దదే జరగబోతోంది" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు.

# ఖమేనీ సలహాదారు ఖతం

*- పెద్ద తలలను పోగొట్టుకున్న ఇరాన్ మిలటరీ*
*- అలుపెరగకుండా ఇజ్రాయెల్ భీకర దాడులు*



ఇజ్రాయెల్-ఇరాన్ల మధ్య యుద్ధం ఐదో రోజూ కొనసాగుతోంది. తాజాగా టెహ్రాన్‌పై టెల్‌అవీవ్ చేసిన దాడుల్లో ఇరాన్ సీనియర్ మోస్ట్ మిలిటరీ అధికారి, ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ సన్నిహిత సైనిక సలహాదారు అయిన అలీ షాధ్మాన్ మృతి చెందినట్లు ఇజ్రాయెల్ దళాలు వెల్లడించాయి. ఆయన సెంట్రల్ టెహ్రాన్లోని ఓ ప్రదేశంలో తల దాచుకున్నట్టు తమకు వచ్చిన కచ్చితమైన సమాచారంతో దాడులు జరిపినట్టు పేర్కొంది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ చేస్తున్న పలు క్షిపణి దాడులకు అలీ షాధ్మాన్ నేతృత్వం వహించారని తెలిపింది. ఇదివరకు షాధ్మాని అల్-అన్బియా అత్యవసర కమాండ్ సెంటర్ డిప్యూటీ కమాండర్, ఇరాన్ సాయుధ దళాల జనరల్ స్టాఫ్ ఫోరంలో ఆపరేషన్స్ డైరెక్టరేట్ అధిపతిగా విధులు నిర్వహించాడు. మరోవైపు ఇరాన్.. ఇజ్రాయెల్‌పై ప్రతిదాడులు చేస్తోంది. మంగళవారం దాదాపు 20 బాలిస్టిక్ క్షిపణులను టెల్‌అవీవ్‌పై ప్రయోగించడంతో భారీ నష్టం సంభవించినట్లు ఐడీఎఫ్ పేర్కొంది. భవనాలు, వాహనాలపై క్షిపణులు పడడంతో మంటలు ఎగసిపడుతున్నట్లు తెలిపింది. ఇరుదేశాల మధ్య యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు పలువురు ఇరాన్ కీలక నేతలు ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌కు చెందిన సాయుధ దళాల జనరల్ స్టాఫ్ నిఘా డిప్యూటీ జనరల్ ఘోలామ్రేజా మెహ్రాబీ, ఆపరేషన్ డిప్యూటీ జనరల్ మెహదీ రబ్బానీ, ఇరానియన్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) చీఫ్ మేజర్ జనరల్ హొస్సేన్ సలామీ, సైనిక దళాల పర్యవేక్షకుడు జనరల్ మహమ్మద్ బాఘేరి, దేశ క్షిపణి కార్యక్రమ అధిపతి జనరల్ అమీర్ అలీ హాజీజదే, పలువురు అణుశాస్త్రవేత్తలు మృతిచెందినట్టు అధికారులు పేర్కొన్నారు. యుద్ధం విషయంలో సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీని హతమార్చిస్తేనే యుద్ధం ముగుస్తుందని పేర్కొన్నారు. దీంతో టెల్‌అవీవ్.. టెహ్రాన్‌లోని కీలక నేతలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నట్టు తెలుస్తోంది.

# అన్నార్తులపై కాల్పులు

*గాజా స్ట్రిప్‌లో 45మంది హతం - లైను తప్పినందుకేనంటున్న ఇజ్రాయెల్*




ఒకవైపు ఇరాన్‌తో యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్.. మరోవైపు గాజానూ వదిలిపెట్టడం లేదు. ఐక్యరాజ్యసమితి,వాణిజ్య ట్రక్కులు ఆహారంతో వస్తుండడంతో మంగళవారం పెద్ద సంఖ్యలో శరణార్థులు గాజా స్ట్రిప్‌లో వేచి ఉన్నారు. అదే సమయంలో ఇజ్రాయెల్ వారిపై కాల్పులకు తెగబడడంతో 45మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయినట్టు స్థానిక వైద్యాధికారులు పేర్కొన్నారు. గాయాలపాలైన క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఇజ్రాయెల్ దాడుల కారణంగా గాజాలో తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడి సామాన్యుల ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. మరోవైపు గాజాలోకి మానవీయ సాయం చేరకుండా ఇజ్రాయెల్ కట్టడిచేసింది. ఈ నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ మద్దతున్న దాతృత్వ సంస్థ, గాజా హ్యుమానిటేరియన్ ఫౌండేషన్ (జీహెచ్ఎఫ్) పాలస్తీనీయులకు ఆహారం సరఫరా చేసే కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే.. శరణార్థులు ఆహారం కోసం వస్తున్న సమయంలో వారిని లక్ష్యంగా చేసుకొని టెల్‌అవీవ్ పదేపదే కాల్పులు జరుపుతున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈవిధంగా ఆహారం కోసం వేచివున్న వారిపై చేసిన దాడుల్లో డజన్ల కొద్దీ ప్రజలు మరణించారని.. వందలాది మంది గాయపడ్డారని తెలిపారు.

కాగా ఆహార కేంద్రానికి నిర్దిష్ట మార్గంలోనే రావాలని ఇజ్రాయెల్ సైన్యం సూచించిందని టెల్‌అవీవ్ పేర్కొంది. అయితే ఆహారం చేజిక్కించుకోవాలన్న అతృతలో పలువురు ఈమార్గం నుంచి పక్కకు వెళు‌తుండడంతో వారిని అదుపు చేయడానికి మాత్రమే సైన్యం కాల్పులు జరుపుతోందని సమర్థించుకుంటోంది.

# నిజమైన ముగింపుండాలి

**ఇరాన్ అణు కార్యక్రమంపై ట్రంప్ వ్యాఖ్య**

ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య దాడులు ఉధృతమైన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాలు కాల్పుల విరమణ ఒప్పందం దిశగా ప్రయత్నాలు చేయాలని గతంలో చెప్పిన ఆయన.. తాజాగా పూర్తి భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. ఆ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణను తాను కోరుకోవడం లేదన్నారు. అయితే, ఇరాన్ అణు సమస్యకు 'నిజమైన ముగింపు' ఉండాలని కోరు కుంటున్నట్టు చెప్పారు. కెనడాలో జరుగుతున్న జీ-7 శిఖరాగ్ర సమావేశం నుంచి అర్ధాంతరంగా అమెరికాకు పయనమైన ట్రంప్.. ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి కృషి చేస్తానని నేను చెప్పలేదు. దీనికి కచ్చితంగా ఓ నిజమైన ముగింపుండాలి. అణ్వాయుధ కార్యక్రమాన్ని ఇరాన్ పూర్తిగా విరమించుకునేలా ఉండాలి" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. మిడిల్ ఈస్ట్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న స్టీవ్ విట్కాఫ్‌నుగానీ, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌నుగానీ చర్చలకు పంపే యోచనలో ఉన్నట్టు చెప్పారు. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయడం లేదంటూ నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తుల్సి గబ్బార్డ్ వ్యాఖ్యలను ట్రంప్ కొట్టిపారేశారు. అణ్వాయుధ తయారీకి ఇరాన్ అతి చేరువలో ఉందని చెప్పారు. ఇజ్రాయెల్ తమపై దాడి చేయడానికి పరోక్షంగా అమెరికా సాయం చేస్తోందని ఇరాన్ అనుమానిస్తున్న నేపథ్యంలో.. ఆ దేశానికి ట్రంప్ తీవ్ర హెచ్చరికలు చేశారు. అమెరికాపై దాడులకు దిగితే.. కనీవినీ ఎరుగని రీతిలో ప్రతిదాడులు ఉంటాయని హెచ్చరించారు. భవిష్యత్తో ఇజ్రాయెల్ దాడులను మరింత ఉధృతం చేసే అవకాశాలు ఉన్నట్లు చెప్పారు. అమెరికా జోక్యం లేకుండానే ఇరాన్ అణుకార్యక్రమం నామరూపాల్లేకుండా పోతుందని భావిస్తున్నట్లు తెలిపారు. అప్పుడే నిజమైన ముగింపు లభిస్తుందని ట్రంప్ పేర్కొన్నారు.



# అది.. అసాధ్యమైతే కాదు

సినిమా ఇండస్ట్రీలో సుదీర్ఘ పనిగంటలు.. వృత్తి, వ్యక్తిగత జీవితాల మధ్య సమన్వయంపై నటి జెనీలియా స్పందించారు. రోజుకు 10 గంటలు పనిచేయటం కాస్త కష్టమే కానీ, అసాధ్యమైతే కాదన్నారు. ఆమిర్‌ఖాన్‌తో కలిసి ఆమె నటించిన తాజా చిత్రం 'సీతారే జమీన్ పర్'. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న మూవీ జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ పని గంటలపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "ఎక్కువ సమయం పనిచేయటం ఎవరికైనా కష్టమే. కానీ, అసాధ్యమైతే కాదు. నేను రోజుకు 10 గంటలు పనిచేస్తా. కొన్నిసార్లు 'మరి కాసేపు ఉండగలరా! అని దర్శకుడు అడుగుతారు. అలాంటప్పుడు 12 గంటలపాటు పనిచేయాల్సి వస్తుంది. అది సరైనదేనని నా అభిప్రాయం. అయితే, అందుకు తగిన విధంగా మనం సర్దుబాటు చేసుకోవాలి. ఒకట్రెండు రోజులు సమయానికి మించి పనిచేయాల్సి రావచ్చు.

అక్కడ మన అవసరం ఉందని అర్థం చేసుకుని ఆ పనిని పూర్తి చేయాలి" అని జెనీలియా అభిప్రాయపడ్డారు. స్పిరిట్ చిత్రం కోసం దీపిక పదుకొణెను దర్శకుడు సందీప్ వంగా సంప్రదించినపుడు.. పని గంటల విషయంలో ఆమె షరతులు పెట్టడంతో ఆమె స్థానంలో త్రిప్తి డ్రిమ్రీని ఎంపిక చేసినట్టు వార్తలొచ్చాయి. సందీప్ పోస్ట్ సామాజిక మాధ్యమాల వేదికగా వైరలైంది. దీనిపై దీపిక మాత్రం స్పందించలేదు. మణిరత్నం, అజయ్ దేవగణ్, నేహా ధూపియా తదితర నటులు దీపిక నిర్ణయానికి మద్దతుగా తమ గళాన్ని వినిపించారు. ఇప్పుడు జెనీలియా సుదీర్ఘ పని గంటలకు తన ఓటు వేశారు.




## విమర్శకులకూ థాంక్స్



తనను అభిమానించే వారితోపాటు ద్వేషించేవారికి కూడా కృతజ్ఞతలు తెలిపారు నటి అనుపమ పరమేశ్వరన్. ప్రస్తుతం ఆమె 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా ప్రచారంలో మాట్లాడుతూ కెరీర్ తొలినాళ్లలో విమర్శలు ఎదుర్కొన్నట్టు గుర్తుచేసుకున్నారు. తెలుగులో ఎన్నో సినిమాలు చేసిన అనుపమ.. మలయాళంలో తక్కువ చిత్రాలు చేయడంపై స్పందించారు. ఈ సినిమాతో మలయాళ ప్రేక్షకుల ఆదరణ పొందుతానని అన్నారు. "చాలామంది నన్ను ట్రోల్ చేశారు. నాకు నటించడమే రాదన్నారు. అలా ట్రోల్ చేస్తున్నప్పటికీ దర్శకుడు ప్రవీణ్ నాకు అవకాశం ఇచ్చారు. 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ వంటి గొప్ప చిత్రంలో ఎంపిక చేశారు. విమర్శలు నాలో ఆలోచనను పెంచాయి. ప్రేక్షకులకు నచ్చే సినిమాలు మాత్రమే అంగీకరించాలని నిర్ణయించుకున్నాను. కొవిడ్ సమయంలో నా కెరీర్‌పరంగా, జీవితంలోనూ ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. నాపై నమ్మకంతో ఇలాంటి పాత్రను ఇవ్వడమే నాకు దక్కిన విజయంగా భావిస్తున్నాను. నాకు మద్దతు ఇచ్చినవారికి, నన్ను ద్వేషించిన వారికి కృతజ్ఞతలు"అని చెప్పారు. అనుపమ ప్రధాన పాత్రలో ప్రవీణ్ నారాయణ్ తెరకెక్కిస్తున్న థ్రిల్లర్ చిత్రమే 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'. సత్యం ఎప్పటికైనా విజయం సాధిస్తుందనేది ఉపశీర్షిక. ఇందులో జానకిగా అనుపమ కనిపించనున్నారు. లాయర్‌గా ప్రముఖ నటుడు సురేశ్‌గోపి నటిస్తున్నారు. జూన్ 27న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.

## సుహాస్.. ఓ భామ అయ్యో రామా'



సుహాస్, మాళవిక మనోజ్ జంటగా రామ్ గోదల తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓ భామ అయ్యో రామా'. హరీశ్ నల్ల నిర్మాత. అనిత హస్సానందాని, అలీ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న మూవీ విడుదలకు సిద్ధమైంది. జులై 11న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నట్టు చిత్ర బృందం ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకుడు రామ్ మాట్లాడుతూ 'ఇదొక బ్యూటిఫుల్ రొమాంటిక్ ఎంటర్టైనర్. అన్ని వర్గాలకు కావాల్సిన అంశాలు ఇందులో ఉంటాయి. ప్రతి ఫ్రేమ్ కలర్ఫుల్‌గా ఉంటుంది. సుహాస్, మాళవిక మనోజ్‌లు ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతారు. అందరిని నవ్వించే వినోదమైన యువకుడి చుట్టూ తిరిగే ఓ కథగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది" అని అన్నారు. ఇటీవల విడుదలైన ఈ చిత్ర టీజర్, పాటలకు మంచి స్పందన వస్తోందని చిత్ర బృందం తెలిపింది.

## బోర్డులోకి నయన్..

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం సక్సెస్ చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ చిత్రాన్ని అనౌన్స్ చేసిన టీమ్, ఇప్పుడు చిత్ర షూటింగ్ కూడా స్టార్ట్ చేసింది. పూర్తి ఎంటర్‌టైనర్ చిత్రంగా రాబోతున్న సినిమాలో చిరు సరికొత్త లుక్‌తో కనిపించబోతున్నాడు. ఇక ఈ చిత్ర షూటింగ్‌ను ఉత్తరాఖండ్‌లోని ముస్సోరిలో జరుపుకుంటున్నారు. షెడ్యూల్ షూటింగ్‌లో హీరోయిన్ నయనతార కూడా తాజాగా జాయినైంది. ముస్సోరిలో కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. అలాగే, చిరు-నయన్‌పై సాంగ్ కూడా షూట్ చేయనున్నట్టు తెలుస్తోంది.

ఈ సినిమాతో అనిల్ రావిపూడి తన సక్సెస్ ట్రాక్‌ను కంటిన్యూ చేస్తాడని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇక ఈ సినిమాకు భీమ్స్ సంగీతం అందిస్తుండగా సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నారు.



## పూరి-సేతుపతి ప్రపంచంలోకి సంయుక్త

టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్టులలో దర్శకుడు పూరి జగన్నాథ్, తమిళ విలక్షణ నటుడు విజయ్‌సేతుపతి కలిసి చేయనున్న సినిమా కూడా ఒకటి. పూరి-సేతుపతి అనే ట్యాగ్‌తో ఈ చిత్ర ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమాలో అందాల భామ సంయుక్త మీనన్ కూడా నటిస్తుందని.. ఆమె పాత్ర ఈ సినిమాలో కీలకంగా ఉండబోతుందని చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈసినిమాలో విజయ్ సేతుపతితోపాటు ఇప్పటికే నటి టబు, నటుడు దునియా విజయ్ నటిస్తున్నట్టు మేకర్స్ ప్రకటించారు.



ఇక ఇప్పుడు సంయుక్త కూడా ఈ సినిమాలో జాయిన్ కావడంతో ఈమూవీపై అంచనాలు మరింత పెరిగాయి. ప్రస్తుతం సంయుక్త పలుచిత్రాల్లో నటిస్తోంది. నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 'అఖండ-2'లో కూడా సంయుక్త నటిస్తుండటంతో ఈ బ్యూటీ వరుస ఆఫర్స్‌తో బిజీ అయింది. ఇక పూరి-సేతుపతి చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతం అందించనున్నట్లు తెలుస్తోంది.

## ఇక కర్నాటకలోనూ థగ్‌లైఫ్

యూనివర్సల్ హీరో కమల్ హాసన్, క్లాసిక్ డైరెక్టర్ మణిరత్నం చాలా కాలం తర్వాత కలిసి చేసిన చిత్రం 'థగ్ లైఫ్'. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. దీనికితోడు సినిమాలో కమల్‌తోపాటు శింబు కూడా నటించడంతో సినిమా బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయమని అందరూ భావించారు. కట్ చేస్తే, సినిమాకు నెగిటివ్ రెస్పాన్స్ రావడంతో డిజాస్టర్‌గా మిగలనుంది. అయితే, ఈ చిత్రం రిలీజ్‌కు ముందే పలు వివాదాల్లో చిక్కుకుంది. కర్ణాటకలో ఈ సినిమాను బ్యాన్ చేశారు. దీంతో ఈ సినిమా నిషేధంపై కమల్ సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. తాజాగా ఈ వివాదంపై సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. సెన్సార్ ముగించుకున్న సినిమా రిలీజ్‌ను ఆపే హక్కు ఎవరికీ లేదని సుప్రీం పేర్కొంది. దీంతో సినిమాను రిలీజ్ అయ్యేలా చూడాలంటూ కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇక 'థగ్ లైఫ్' కర్ణాటక రిలీజ్‌కు అడ్డంకి తొలిగిపోవడంతో ఈ సినిమా అక్కడ ఎప్పుడు రిలీజ్ అవుతుందనే అంశంపై చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తున్నారు.

## సెంచరీ టాక్‌లో పెద్ది

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ ప్రస్తుతం రూరల్ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పెద్ది'లో నటిస్తున్నాడు.దదర్శకుడు బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన ఫస్ట్ షాట్ గ్లింప్స్‌కు సెన్సేషనల్ రెస్పాన్స్ దక్కింది. దీంతో ఈ సినిమాపై అంచనాలు మరో లెవెల్‌కు చేరాయి. ఇక ఈ చిత్ర డిజిటల్ రైట్స్ డీల్ అంచనాలను మరింత పెంచే లా చేస్తుంది. ఈ సినిమా డిజిటల్ రైట్స్‌ను ప్రముఖ ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్ర రైట్స్‌ను ఏకంగా రూ.105కోట్ల భారీ డీల్‌తో నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుందట. ఇంత భారీ రేటుకు 'పెద్ది' డిజి టల్ రైట్స్‌సేల్ కావడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. పెద్ది సినిమాపై ఎలాంటి అంచనాలు ఉంటే, ఈ రేంజ్‌లో కేవలం డిజిటల్ రైట్స్‌డీల్ జరుగుతుందని సినీ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. ఇక ఈ సినిమాతో రామ్‌చరణ్ మరోసారి బాక్సాఫీస్‌ను షేక్ చేయడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తోండగా ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు.